సోమవారం
25-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 95
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మనది విడదీయలేని బంధం

రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఆర్ఓకే) ప్రధాని హాన్ డక్-సూ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఝెజాంగ్ ప్రావిన్స్‌లోని రాజధాని నగరమైన హాంగ్‌ఝౌలో భేటీ అయ్యారు. చైనా, ఆర్ఓకే మధ్య స్నేహం సుస్థిరమని జిన్‌పింగ్ అన్నారు. తమవి విడదీయలేని సహకార భాగస్వామ్య దేశాలన్నారు. పటిష్ఠ దౌత్య సంబంధాలతో రెండు దేశాలకు, ప్రజలకు ఉమ్మడి ప్రయోజనాలు కలుగుతున్నట్లు చెప్పారు.

2 లో

అక్టోబర్ 5వరకు
చంద్రబాబుకు రిమాండ్

మరో 11 రోజులు పొడిగించిన ఏసీబీ కోర్టు
ముగిసిన రెండు రోజుల సీఐడీ కస్టడీ
నేడు బెయిల్, కస్టడీ పిటిషన్లు, పీటీ వారెంట్లపై వాదనలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ (ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ) కుంభకోణం కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకు అక్టోబరు 5వ తేదీ వరకు రిమాండ్ పొడిగించారు. అంటే మరో 11రోజుల పాటు చంద్రబాబును జ్యుడిషియల్ కస్టడీపై రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి హిమబిందు ఆదేశించారు. దీంతో టీడీపీ శ్రేణులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

మరో పక్క రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబు సీఐడీ అధికారుల విచారణ ముగిసింది. రెండు రోజులపాటు సీఐడీ అధికారులు చంద్రబాబును విచారించారు. ఈనెల 23వ తేదీన ప్రారంభమైన కస్టడీ విచారణ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు రెండు రోజులపాటు అనుమతిస్తూ తీర్పునిచ్చిన విషయం విదితమే. దీంతో సీఐడీ అధికారి ధనుంజయుడు అధ్వర్యంలో రెండు బృందాలుగా అధికారులు విడిపోయి చంద్రబాబును సెంట్రల్ జైల్లో విచారించారు. ఈ సమయంలో చంద్రబాబుకు వివిధ ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. చంద్రబాబు విచారణను సీఐడీ అధికారులు వీడియో ద్వారా చిత్రీకరించారు. 30 అంశాలతో దాదాపు 120 ప్రశ్నలు వేసి, కీలకమైన సమాచారం రాబట్టేందుకు సీఐడీ అధికారులు ప్రయత్నించారు. రెండు రోజులపాటు మొత్తంగా 12 గంటల పాటు చంద్రబాబును సీఐడీ అధికారులు విచారించారు. ప్రతి గంటకూ ఐదు నిమిషాలపాటు విరామం ఇచ్చారు. చంద్రబాబు తరపు న్యాయ వాదుల సమక్షంలో ఈ విచారణ కొనసాగింది. అనంతరం జైలులో చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించి, వర్చువల్‌గా ఏసీబీ కోర్టు జడ్జి ఎదుట చంద్రబాబును సీఐడీ అధికారులు ప్రవేశపెట్టారు. అనంతరం జైలు నుంచి వెళ్లిపోవాలని జడ్జి వారిని ఆదేశించారు.

మిమ్మల్ని విచారణలో ఇబ్బంది పెట్టారా?

చంద్రబాబుతో వర్చువల్‌గా విజయవాడ ఏసీబీ కోర్టు జడ్జి హిమబిందు మాట్లాడారు. విచారణ సమయంలో సీఐడీ అధికారులు ఏమైనా ఇబ్బందులు పెట్టారా? థర్డ్ డిగ్రీ ప్రయోగించారా? వైద్య పరీక్షలు చేశారా? అని చంద్రబాబును ఆరా తీశారు. విచారణలో ఇబ్బంది పెట్టలేదని చంద్రబాబు చెప్పారు. సోమవారం మీ బెయిల్‌పై విచారిస్తామని జడ్జి తెలిపారు. ఇప్పుడే అంతా అయిపోయినట్లుగా భావించవద్దని... మీరు జ్యుడిషియల్

- మిగతా 2 లో

మతోన్మాదాన్ని, విద్వేషాన్ని
ఐక్యంగా ప్రతిఘటిద్దాం



- ఆర్ఎస్ఎస్-బీజేపీ ఆలోచనకు అద్దంపట్టిన బిధూడీ వ్యాఖ్యలు : రాజా
- దానిష్ అలీతో సీపీఐ ప్రధాన కార్యదర్శి భేటీ-సంఘీభావం
- లోక్‌సభ హుందాతనాన్ని కాపాడాలి: సంజయ్ రౌత్

న్యూదిల్లీ/ముంబై: దేశంలో మతోన్మాదాన్ని, విద్వేషాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దామని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. బీఎస్పీ ఎంపీ కున్వర్ దానిష్ అలీని కలిసి సంఘీభావం తెలిపారు. లోక్‌సభలో ఎంపీకి జరిగిన అవమానంపై రాజా ఆందోళన వ్యక్తంచేశారు. పేట్రేగిన మతోన్మాదాన్ని, విద్వేషానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేద్దామని అన్నారు. బీజేపీ ఎంపీ రమేశ్ బిధూఢీ వ్యాఖ్యలు గర్హనీయమన్నారు. ఆయన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్-బీజేపీ ఆలోచనలకు, మనస్తత్వానికి అద్దం పట్టాయని వ్యాఖ్యానించారు. ఇలాంటి వ్యవహారాల్లో ప్రధాని మౌనంతో రాజ్యాంగంపై ఆయన విధేయతను ప్రశ్నిస్తుందని రాజా అన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ కూడా దానిష్ అలీకి మద్దతు ప్రకటించారు. బిధూఢీ అభ్యంతకర వ్యాఖ్యలను ఖండించారు. లోక్‌సభలో అధికార పక్ష సభ్యుడు ఓ విపక్ష ఎంపీని ఉగ్రవాదిగా తీవ్రవాదిగా పిలవడం, ఆయన మతాన్ని, కులాన్ని దూషించడం, అనుచిత పదజాలాన్ని వాడటం ఆక్షేపణీయమని ఆదివారం విలేకరులతో మాట్లాడిన రౌత్ అన్నారు. ఒకవేళ విపక్ష ఎంపీ ఎవరైనా ఇలా మాట్లాడివుంటే కచ్చితంగా ఖండిచేవాడిని అని విలేకరులతో రౌత్ తెలిపారు. పార్లమెంటులో ఇటువంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని, సభ గౌరవాన్ని, హుందాతనాన్ని కాపాడటం ప్రతి సభ్యుని బాధ్యతని ఆయనన్నారు. 'మీరు ఆప్ ఎంపీలు రాఘవ్ చద్దా, సంజయ్ సింగ్, రజినీ పటేల్, కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరిని సస్పెండ్ చేశారు కానీ బిధూఢీకి నోటీసు మాత్రమే ఇచ్చారు. పార్లమెంటు నిబంధనలు సభ్యులందరికీ సమానం కాదా!' అని రౌత్ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో దానిష్‌కు మద్దతుగా కాంగ్రెస్, టీఎంసీ, ఎన్సీపీ తదితర ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నిలిచిన విషయం తెలిసిందే.

చంపాలని చూస్తున్నారు: దానిష్ అలీ

తన హత్యకు కుట్ర జరుగుతోందని బీఎస్పీ ఎంపీ దానిష్ అలీ ఆరోపించారు. 'లోక్‌సభలో మాటలతో చంపారు. ఇంటి బయట నన్ను హత్యకు యత్నిస్తున్నారు' అని ఆయనన్నారు. రమేశ్ బిధౌఢీని రెచ్చగొట్టినట్లు తనపై తప్పుడు ప్రచారానికి బీజేపీ నేతలు తెరతీశారన్నారు. బీజేపీ నేత నిషికాంత్ దూబే కూడా అవాస్తవాలు చెబుతూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. బిధూఢీ చేసిన అనుచిత వ్యాఖ్యలతో ఆయనపై కఠిన చర్యలకు విపక్ష నేతలు డిమాండ్ చేయడంతో గురువారం లోక్‌సభలో ఘర్షణ వాతావరణం నెలకొంది. చంద్రయాన్-3 విజయంపై చర్చ సమయంలో అలీపై బిధౌఢీ విరుచుకుపడ్డారు. అనుచిత పదజాలంతో దూషించారు. సభలో అనుచిత ప్రవర్తన, అలీ వ్యాఖ్యలపై విచారణ కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు నిషికాంత్ దూబే శనివారం లేఖ రాశారు. బిధూఢీ మాట్లాడుతుంటే అలీ రన్నింగ్ కామెంట్రీ చేశారని, ఆయనను రెచ్చగొట్టారని లేఖలో దూబే ఆరోపించారు. దానిష్ అలీ స్పందిస్తూ తనపై నిరాధార ఆరోపణలు చేశారని, దూబే లేఖను చూశానన్నారు. 'సభలో మౌఖికంగా చంపేశారు... ఇంటి బయట హత్యకు యత్నిస్తున్నారు. నిరాధార ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని, దూబేపై హక్కుల అతిక్రమణ కేసు వేయాలని స్పీకర్‌ను కోరా' అని వెల్లడించారు. బిధూఢీని రెచ్చగొట్టినట్టు తప్పుడు కథనాన్ని బీజేపీ నేతల్లో కొందరు వినిపిస్తున్నారని, తాను మాత్రం ప్రధాని ప్రతిష్ఠను కాపాడేందుకు ప్రయత్నించానని అలీ చెప్పారు. మోదీని ఉద్దేశించి చేసిన అభ్యంతకర వ్యాఖ్యలను రికార్డుల్లో తొలగించాలని సభాపతిని కోరినట్లు తెలుపుతూ ఓ వీడియోను బీఎస్పీ ఎంపీ పోస్టు చేశారు. 'తాజా పరిణామం చెరగని మచ్చ. కల్పిత కథనాలు... వాస్తవాల వక్రీకరణ ఈసారి పనిచేయవు' అని ఆయన ట్వీట్ చేశారు.

నేటి నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు
బాపట్ల ముస్తాబు

కూలి దండు మహాప్రదర్శన, బహిరంగ సభ
నారాయణ, రామకృష్ణ, గుల్జార్ సింగ్ గోరియా రాక

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు నేటి నుండి మూడు రోజుల పాటు బాపట్ల లో జరగనున్నాయి. ఈ మహాసభలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పట్టణాన్ని అరుణపతాకాలు, తోరణాలు, జండాలు, ఫ్లెక్సీలతో అలంకరించారు. తొలి రోజు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు కూలి దండు

- మిగతా 2 లో

తొమ్మిది వందేభారత్ రైళ్ల పరుగు
వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ

న్యూదిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తొమ్మిది వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు కల్పిస్తూ దేశవ్యాప్తంగా రైళ్లను అనుసంధానించే

- మిగతా 2 లో

తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సు చోరీ
నాయుడుపేట వద్ద బస్సు స్వాధీనం

2 లో

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

- డీఎస్సీపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- 8 లక్షల మంది ఎదురుచూపు
- ప్రభుత్వ వైఖరితో నిరుద్యోగుల్లో నిరాశ
- విద్యామంత్రి పొంతనలేని వ్యాఖ్యలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్... డీఎస్సీ అభ్యర్థులకు దగా చేస్తున్నారనే విమర్శలున్నాయి. నాలుగున్నరేళ్ల నుంచి జగన్ సర్కారు డీఎస్సీ విషయంలో నిరుద్యోగులతో మైండ్‌గేమ్ ఆడుతోంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ ప్రకటన కోసం నిరుద్యోగులు పడిగాపులు పడుతున్నారు. ఇంకెన్నాళ్లు ఎదురు చూడాలి? అసలు డీఎస్సీ వస్తుదా? లేదా? అనే ఆందోళన వారిలో మొదలైంది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన వెల్లడిస్తుందని నిరుద్యోగులు ఎదురు చూడటం... నిరాశ చెందటం పరిపాటిగా మారింది. ఈ సమావేశాల్లోనూ డీఎస్సీపై ప్రభుత్వం దాటవేత ధోరణి ప్రదర్శిస్తోంది. శాసన మండలిలో పీడీఎఫ్ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అసంతృప్తిగా సమాధానమిచ్చారు. మళ్లీ తర్వాత మీడియా సమావేశంలోనూ అదే వైఖరితో డీఎస్సీ పై స్పష్టత ఇవ్వకుండా మంత్రి బొత్స బదులివ్వడంతో నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. రాష్ట్రంలో ఎన్నిలకు ఇంకా ఎనిమిది నెలలే గడువుంది. జనవరి నుంచి ఎన్నికల హడావుడి ప్రారంభమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలకు సాధారణంగా జూన్ లేదా

- మిగతా 2 లో

1న తెలంగాణకు ప్రధాని రాక

2 లో

ఇదీ లోకం!

మీ ఊరితో నాకెంత అనుబంధం అంటే నా మొదటి లాండ్‌స్కామ్ ఇక్కడే చేసా దానికి ఇరవయ్యేళ్ళు పూర్తయ్యాయి!

మోదీ హఠావో - దేశ్ బచావో

రాజకీయ నినాదాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లాలి !: వినయ్ విశ్వం పిలుపు!

తిరుప్పూర్ నుంచి డి సోమసుందర్

కార్మికులు తమ వర్గప్రయోజనాల పరిరక్షణకోసం మోదీ హఠావో దేశ్ బచావో నినాదంతో గట్టి రాజకీయ వైఖరి తీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని , దేశప్రజల కోసం రాజకీయ పోరాటంలో కార్మికులు భాగస్వాములు కావాలని సీపీఐ పార్లమెంటరీపార్టీ నాయకులు, ఏఐటీయూసీ కార్యనిర్వాహక అధ్యక్షులు వినయ్ విశ్వం పిలుపు నిచ్చారు. బీజేపీ వినాశకర ఆర్థిక, సామాజిక విధానాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడానికి కార్మికవర్గం పూనుకోవాలని ఆయన ఉద్ఘాటించారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరుప్పూర్ లో మూడురోజులపాటు జరిగిన ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ సమావేశాల ముగింపుసభలో వినయ్ విశ్వం మాట్లాడారు. ఆదివారం జరిగిన ముగింపు సమావేశానికి ఏఐటీయూసీ అధ్యక్షుడు రామేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. వినయ్ విశ్వం మాట్లాడుతూ గత వారం జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ప్రధాని నరేంద్రమోదీ ఒక ప్రహసనంగా మార్చారని, సమావేశాల నిర్వహణ విషయంలో ప్రతిపక్షాలను విస్మరించి , బీజేపీ సొంత వ్యవహారంగా నడిపారని విమర్శించారు.

పార్లమెంట్ పాత భవనాన్ని మోదీ మ్యూజియంగా మిగిల్చారనీ, దానితో ముడిపడిన ప్రజాస్వామ్య విలువలను, ఉత్తమ పార్లమెంటరీ సంప్రదాయాలను బీజేపీ తుంగలోకి తొక్కిందని వినయ్ విశ్వం విమర్శించారు. కొత్త పార్లమెంట్‌కు సినిమా నటులను, తమపార్టీ కార్యకర్తలను ఆహ్వానించి సొంత ప్రచారానికి వాడుకున్న తీరు గర్హనీయమని చెప్పారు. సమావేశాలలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన రోజున బీజేపీ మహిళా కార్యకర్తలను పెద్దఎత్తున సభకు రప్పించి మోదీకి జేజేలు కొట్టించుకోవడం ఆపార్టీ ప్రచార యావకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ ఎంతగా గొప్పలు చెప్పుకున్నా మహిళా రిజర్వేషన్ బిల్లును తయారు చేసింది సీపీఐ నేత గీతాముఖర్జీ అనే వాస్తవాన్ని దాచలేకపోయిందని , గీతా ముఖర్జీ వల్లనే బిల్లు వచ్చిందన్న సంగతి దేశప్రజలందరికీ

- మిగతా 2 లో

అంగన్‌వాడీలకూ
తప్పని నిర్బంధం

- అరెస్టు అప్రజాస్వామికం
- వామపక్ష పార్టీల ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంగన్‌వాడీ టీచర్లు, కార్మికులు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు ఈనెల 25న విజయవాడలో తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించింది. ఈ ధర్నాకు అంగన్‌వాడీలు రాకుండా అడ్డుకునేందుకు ఆదివారం నుంచే ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం మొదలుపెట్టింది. ఈ అరెస్టులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయమని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల నేతలు

- మిగతా 2 లో

మనది విడదీయలేని బంధం

ఆర్ఓకే ప్రధానితో భేటీలో జిన్‌పింగ్



హాంగ్‌ఝౌ: రిపబ్లిక్ ఆఫ్ కొరియా (ఆర్ఓకే) ప్రధాని హాన్ డక్-సూ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఝెజాంగ్ ప్రావిన్స్‌లోని రాజధాని నగరమైన హాంగ్‌ఝౌలో భేటీ అయ్యారు. చైనా, ఆర్ఓకే మధ్య స్నేహం సుస్థిరమని జిన్‌పింగ్ అన్నారు. తమవి విడదీయలేని సహకార భాగస్వామ్య దేశాలన్నారు. పటిష్ఠ దౌత్య సంబంధాలతో రెండు దేశాలకు, ప్రజలకు ఉమ్మడి ప్రయోజనాలు కలుగుతున్నట్లు చెప్పారు. ప్రాదేశిక శాంతి, అభివృద్ధికీ తమ మైత్రి దోహదమవుతోందని జిన్‌పింగ్ తెలిపారు. 1992 నుంచి దౌత్య సంబంధాలు, స్నేహం, సహకారం కొనసాగుతున్నట్లు గుర్తుచేశారు.

అవి మరింత బలోపేతం కావాలని, రెండు దేశాలు కలిసి పనిచేయాలని, ఒకే దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చైనా-ఆర్ఓకే సంబంధాలకు ప్రాధాన్యతనిచ్చే ఉమ్మడి విధానాలు, చర్యలు అవసరమన్నారు. పరస్పరం గౌరవం, సహకారంతో పయనం సాగిద్దామని కోరారు. ఆధునిక చైనా మార్కెట్‌లో మెరుగైన అవకాశాలు మరింతగా పెరుగుతాయని జిన్‌పింగ్ చెప్పారు. ద్వైపాక్షిక సంబంధాలు, సహకార బంధాన్ని మరింత పెంచుకోవాలని, పారిశ్రామిక, సరఫరా గొలుసుల సమగ్రత, ఆర్థిక సయోధ్యను కోరుకున్నారు. హాన్ డక్-సూ మాట్లాడుతూ హాంగ్‌ఝౌలో ఏషియన్ గేమ్స్ విజయానికిగాను జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ఇలాంటి సమయంలో ఆర్ఓకే, చైనా మధ్య ఉన్నతస్థాయి దౌత్యం ముఖ్యమని అన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను పెంచుకోవడం, సవాళ్లను ఎదుర్కొనేందుకు కలిసి ముందుకెళ్లడం కీలకమని నొక్కిచెప్పారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదం కావాలని ఆకాంక్షించారు. సమావేశంలో చైనా సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఏడేళ్ల తర్వాత మొదలైన దౌత్యం

ఇరాన్, మాల్దీవుల ప్రకటన

టెహ్రాన్: సుమారు ఏడేళ్ల ప్రతిష్టంభన తర్వాత తమ దౌత్య సంబంధాలను పునరుద్ధరించుకుంటున్నట్లు ఇరాన్, మాల్దీవులు ప్రకటించాయి. పరస్పర ప్రయోజనాల దృష్ట్యా ఈ మేరకు నిర్ణయించినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రెండు దేశాల విదేశాంగ శాఖ మంత్రుల మధ్య భేటీ అనంతరం దౌత్య సంబంధాల పునరుద్ధరణపై ఏకాభిప్రాయం కుదిరినట్లు వెల్లడించింది. న్యూయార్క్‌లో ఐరాస సర్వసభ్య సమావేశం క్రమంలో ఇరాన్, మాల్దీవుల విదేశాంగ మంత్రులు హుస్సేన్ అమీర్ అబ్దుల్లాహియన్, అహ్మద్ ఖలీల్ చర్చలు జరిపినట్లు అధికారిక ప్రకటన పేర్కొంది. ఇతర దేశాలతో సాధారణ సంబంధాలకు ఇరాన్, మాల్దీవులు చేస్తున్న కసరత్తు క్రమంలో దౌత్య సంబంధాల పునరుద్ధరణ జరిగింది. 2016 మేలో దౌత్యపరంగా ఈ రెండు దేశాలు తెగతెంపులు చేసుకోవడం విదితమే.

పదో రోజుకు యునైటెడ్ ఆటో వర్కర్ల సమ్మె

కొనసాగుతున్న చర్చలు

కార్మికులకు బైడెన్ మద్దతు

చికాగో: తమ వేతనాలలో 36శాతం పెంపుదలకు డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఆటో వర్కర్లు (యూఏడబ్ల్యూ) చేస్తున్న సమ్మె ఆదివారం పదో రోజుకు చేరుకుంది. 38 జనరల్ మోటార్స్ కో, స్టెల్లాంటిస్ ఎన్‌వీ విడిభాగాల సరఫరా కేంద్రాల మొత్తం 5,600మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. జీతాలు పెంచాలని, పాత వేతనాల పద్ధతికి ముగింపు పలకాలని కార్మికుల సంఘం డిమాండ్ చేస్తోంది. పెరుగుతున్న జీవ వ్యయం, ఇతరత్రా డిమాండ్ల దృష్ట్యా మెరుగైన వేతనాలివ్వాలని కోరుతోంది. సమ్మె నుంచి ఫోర్డ్ మోటార్ కోకు మినహాయింపు లభించింది. యూఏడబ్ల్యూ అధ్యక్షులు షాన్ ఫెయిన్ మాట్లాడుతూ సంబంధిత యాజమాన్యాలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ఫోర్డ్ ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు చేయగా రాజీ కుదరలేదన్నారు. ఒప్పంద కాలంలో కార్మికుల వేతనాల్లో 20శాతం పెంపుదలకు ఫోర్డ్‌తో పాటు జీఎం, స్టెలాంటిస్ ప్రతిపాదించినట్లు చెప్పారు. కనీసం 36శాతం పెంపుదలను తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. అయితే కార్మికుల సమ్మెకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మద్దతు ప్రకటించేందుకు మంగళవారం మిచిగన్ వెళ్లనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. ఆయన యూఏడబ్ల్యూ కార్మికులను కలిసి సంఘీభావం తెలుపనున్నారు. 'యూఏడబ్ల్యూ ఉద్యోగాలకు మంచి వేతనాలిస్తూ తయారీ రంగం పురోగమించేందుకు ఇదే సమయమని బైడెన్ ట్వీట్ చేసినట్లు స్థానిక మీడియా తెలిపింది.

తొమ్మిది వందేభారత్ రైళ్ల పరుగు

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యంలో భాగంగా కొత్త రైళ్లను పట్టాలెక్కించారు. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలకు అనుగుణంగా వేగం, మౌలిక వసతుల కల్పనల సమతూకంతో వందేభారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. రైళ్లను ప్రారంభించిన రైల్వేస్టేషన్లలో కార్యక్రమాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవంలో మోదీ మాట్లాడుతూ వందేభారత్ రైళ్లకు ప్రాచుర్యం పెరుగుతోందన్నారు. కోటి11లక్షల మంది ప్రయాణికులు ఈ రైళ్లలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. 25 వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని, మరో తొమ్మిది అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. అన్ని ప్రాంతాలకూ ఈ రైళ్లు అనుసంధానించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. స్టేషన్ల అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నట్లు మోదీ తెలిపారు. అమృత కాలంలో పనులు జరుగుతున్న రైల్వేస్టేషన్లను 'అమృత్ భారత్ స్టేషన్లు'గా పిలుస్తున్నామని ఆయనన్నారు.కొత్త వందేభారత్ రైళ్లు రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, బీహార్, పశ్చిమబెంగాల్, కేరళ, ఒడిశా, జార్ఖండ్, గుజరాత్ సహా 11 రాష్ట్రాల గుండా రాకపోకలు సాగిస్తాయని చెప్పారు.

కొత్త రైళ్లలో ఉదయపూర్-జైపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్, తిరునల్వేలి-మదురై-చెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విజయవాడ-చెన్నై (వయా రేణిగుంట) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, పాట్నా-హౌరా వందే భారత్ ఎక్స్‌ప్రెస్, కాసరగాడ్-తిరునల్వేలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, రూర్కెలా-భువనేశ్వర్-పూరి వందేభారత్ ఎక్స్‌ప్రెస్, రాంచీ-హౌరా వందేభారత్ ఎక్స్‌ప్రెస్, జామ్‌నగర్-అహ్మదాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ?

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబరులో ప్రకటన ఇస్తారు. డిసెంబరులో డీఎస్సీకి ప్రకటన ఇస్తే అభ్యర్థుల సన్నద్ధతకు సమయం సరిపోదు. దీనిని దృష్టిలో ఉంచుకుని తక్షణమే జంబో డీఎస్సీ ప్రకటన ఇవ్వాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే తమ భవిష్యత్ నడిరోడ్డు పైనేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, ఇంగ్లీషు బోధనా మాధ్యమం ప్రవేశపెట్టడం వెరసి ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాల్ని అందరూ స్వాగతిస్తున్నారు. ఇదే సమయంలో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయకుండా... ఉన్న వారితోనే ఈ ప్రభుత్వం సర్దుబాటు చేయడం విమర్శలకు తావిస్తోంది. విద్యార్థులకు బోధనా సామర్థ్యం తగ్గనుంది. ఉన్న ఉపాధ్యాయులపైనా పనిభారం పడటంతో వారంతా మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. వాటిని విద్యాశాఖ అధికారులు గుర్తించడం లేదనే విమర్శలున్నాయి.

2018 నుంచి డీఎస్సీ ఏదీ ?

ఏపీలో 2018 నుంచి డీఎస్సీ లేదు. గత చంద్రబాబు ప్రభుత్వం హయాంలో ఇచ్చిన డీఎస్సీ-2018లో అతి తక్కువగా పోస్టులున్నాయి. దాంతో నిరుద్యోగులు కన్నెర్రజేసి టీడీపీకి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏటా పదివేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తామని ప్రకటించారు. అప్పటి ప్రతిపక్ష నేత జగన్... అధికారంలోకి వస్తే తమకు న్యాయం చేస్తారని నిరుద్యోగులు నమ్మి జగన్‌ను బలపరిచారు. ఇప్పుడు నాలుగున్నరేళ్లయినా ఒక్క డీఎస్సీ ప్రకటనా ఇవ్వలేదు. ప్రతిసారీ ప్రభుత్వం కుంటి సాకులు చెబుతోంది. అన్ని విభాగాల్లోనూ ఎంతోకొంత పోస్టులను భర్తీకి ప్రకటనలు జారీజేస్తుంటే, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీపై మాత్రం జాప్యం చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ లెక్కల ప్రకారం ఏపీలో 40వేలకుపైగా ఉపాధ్యాయ ఖాళీలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా లెక్కలు చూపుతోంది. ఆ లెక్కలకూ తగిన విధంగా డీఎస్సీ ఎప్పుడిస్తారనేదీ చెప్పడం లేదు. ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థుల్లో అధిక శాతం డీఎస్సీ పోస్టులపైనే ఆధారపడి ఉంటారు. డీఎస్సీలో తుది వరకు ప్రయత్నించి, చివరకు వయోపరిమితి మించిపోతే ప్రైవేట్ పాఠశాలల్లో చేరడం ఆనవాయితీ. ఇప్పుడు 2018 తర్వాత ఇంతవరకు డీఎస్సీ ఇవ్వలేదు. దాదాపు ఐదేళ్ల వరకు ప్రకటన రానందున చాలా మంది నిరుద్యోగుల వయోపరిమితి మించి పోయింది. లక్షలాది మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు అనర్హులుగా మారారు. డీఎస్సీ జాప్యాన్ని జగన్ సర్కారు గుర్తించి... ప్రస్తుతమున్న డీఎస్సీ వయోపరిమితిని 44 ఏళ్ల(జనరల్ వారికి) నుంచి 47 ఏళ్లకు పెంచాలని అభ్యర్థులు కోరుతున్నారు. రిజర్వేషన్ వర్గాల వయోపరిమితి సడలింపును ఐదేళ్లపాటు యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే రెండు లక్షలకుపైగా నిరుద్యోగులకు వయస్సు మించి డీఎస్సీకి దూరమయ్యే ప్రమాదముంది.

8లక్షల మంది భవిత ప్రశ్నార్థకం

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల కోసం ఎదురు చూస్తున్న 8 లక్షల మంది అభ్యర్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఇందులో ఐదు లక్షలమంది బీఈడీ, డీఈడీ, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల శిక్షణ పూర్తిచేసుకుని ఉన్నారు. వారంతా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత పొందారు. మరో మూడు లక్షల మంది ఈ ఏడాది వివిధ విభాగాల్లో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ, చివరి దశలో ఉన్నారు. టెట్, ఆ తర్వాత డీఎస్సీ ప్రకటన కోసం వేచిస్తున్నారు. ఇప్పటికీ డీఎస్సీ ఇవ్వకపోడంతో వారికి దిక్కుతోచడం లేదు. ఇప్పటికే దఫాలుగా కోచింగ్ సెంటర్లలో అభ్యర్థులు శిక్షణ పొంది ప్రకటన కోసం వేచిస్తున్నప్పటికీ ఫలితం లేదు. అటు కోచింగ్ సెంటర్లను నిర్వహించడమూ నిర్వాహకులకు మోయలేని భారంగా మారింది. ప్రకటన లేకపోవడంతో విద్యార్థులు శిక్షణకు రాకపోవడంతో వారంతా ఆర్థిక సమస్యలతో నలిగిపోతున్నారు.

జగన్ సర్కారు దిగివచ్చి డీఎస్సీ నియామకాలపై తక్షణమే ప్రకటన చేయకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని నిరుద్యోగ అభ్యర్థులు పేర్కొంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు సభల్లో నిరసనలు తెలిపిన తరహాగానే, ప్రస్తుత సీఎం జగన్ సభల్లోనూ నిరసనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కనీసం 25వేలకు తగ్గకుండా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటన జారీజేయాలి. లేకుంటే నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థుల ఆగ్రహానికి ఈ ప్రభుత్వం గురికాక తప్పదు.

తిరుమలలో ఎలక్ట్రిక్ బస్సు చోరీ

విశాలాంధ్ర - తిరుమల/ నాయుడుపేట: టీటీడీ అధ్వర్యంలో తిరుమలలో భక్తుల కోసం ఉచితంగా నడిపే ఓ ఎలక్ట్రిక్ బస్సు ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురైంది. అయితే చోరీ అయిన ఎలక్ట్రిక్ బస్సును జీపీఎస్ ఆధారంగా స్వాధీనం చేసుకోవడం కూడా జరిగింది. వివరాల్లోకెళితే తెల్లవారుజామున దుండగులు బస్సును తీసుకుపోయారు. జీపీఎస్ ద్వారా బస్సును ట్రాక్ చేసిన పోలీసులు... నాయుడుపేట పట్టణ సమీపంలోని టిడ్కో ఇళ్ల వద్ద జాతీయ రహదారిపై బస్సును స్వాధీనం చేసుకున్నారు. తిరుమలలోని టీటీడీ డిపో దగ్గర రాత్రి బస్సును పార్క్ చేశారు. తెల్లవారి చూసేసరికి గ్యారేజ్‌లో బస్సు లేదు. వెంటనే తిరుమల క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు టీటీడీ అధికారులు. బస్సులోని జీపీఎస్ సిస్టమ్ ద్వారా విచారణ చేశారు. తెల్లవారుజామున 3గంటల సమయంలో బస్సును దొంగిలించి... తిరుపతికి, అక్కడి నుంచి నాయుడుపేటకు తీసుకెళ్లినట్టు గుర్తించారు. అక్కడి కి క్రైమ్ పోలీసులు పంపారు. అక్కడ టీటీడీ ఎలక్ట్రిక్ బస్సు గుర్తించిన పోలీసులు... నిందితుల కోసం బిరదవాడ సమీపంలో ఉన్న టిడ్కో ఇళ్లల్లో గాలిస్తుండగా పారిపోయారు.

తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరుగుతుండడంతో అధికారులంతా ఆ హడావుడిలో ఉన్నారు.భక్తులతో కలిసిపోయిన దుండగులు సమయం చూసుకుని ధర్మరథం బస్సును కొట్టేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ బస్సు విలువ సుమారు రూ.2 కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రసుత్తం తిరుమలలో నడుస్తున్న కొత్త విద్యుత్ బస్సుల్లో జీపీఎస్ వ్యవస్థ ఉండటంతో నాయుడుపేట వద్ద బస్సు ఉందని పోలీసులు గుర్తించగలిగారు.

అంగన్‌వాడీలకూ తప్పని నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

కే రామకృష్ణ-(సీపీఐ), వీ శ్రీనివాసరావు-(సీపీఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి వై సాంబశివరావు, సీపీఐ(ఎంఎల్) నుంచి జాస్తి కిశోర్‌బాబు, ఎంసీపీఐ(యూ) నుంచి కాటం నాగభూషణం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి ఎన్.మూర్తి, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, ఎస్‌యూసీఐ(సీ) నుంచి బి.ఎస్.అమర్‌నాథ్, ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పీవీ సుందరరామరాజు, రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ నుంచి జానకీ రాములు ఆదివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీ టీచర్లను ఎక్కడికక్కడ ఇళ్ల వద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతినివ్వకపోవడం అప్రజాస్వామికమని తెలిపారు. అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యల కోసం కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారని గుర్తుచేశారు. కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేశారని వివరించారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణమన్నారు. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, దానిని అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమేనని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని, ఈనెల 25న విజయవాడలో జరగనున్న ధర్నాకు అనుమతినివ్వాలని, వారి న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని, అందుకు సంఘ నాయకులతో చర్చలు జరపాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు.

మోదీ హఠావో - దేశ్ బచావో

(మొదటి పేజీ తరువాయి)

తెలుసునని వినయ్ విశ్వం స్పష్టం చేశారు. ప్రత్యేకసమావేశాల గురించి మోదీ ఎంతఆర్భాటం చేసినా ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యల గురించి అక్కడ తగినచర్చ జరగలేదన్నారు. బీజేపీ ఆర్థిక, సామాజిక విధానాలలోని బూటకాన్ని ఎండగట్టడానికి కార్మికవర్గం పూనుకోవాలని , తమ హక్కుల పరిరక్షణ కోసం గట్టి ఉద్యమాలను నిర్మించాలని, రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపటానికి ప్రజల్లో చైతన్యం తేవడానికి కార్మికవర్గం పూనుకోవాలని వినయ్ విశ్వం పిలుపు ఇచ్చారు. కార్మిక హక్కులపై దాడి, ప్రైవేటీకరణ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, పతనం అవుతున్న రూపాయి విలువ, వివిధ ప్రాంతాల్లో చెలరేగుతున్న సామాజిక ఘర్షణలు వంటి తీవ్ర సమస్యలపై మరిన్ని పోరాటాలు సాగించాల్సి ఉంటుందని వినయ్ విశ్వం దిశానిర్దేశం చేశారు. ఏఐటీయూసీ 104 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అక్టోబర్ 31న దేశమంతటా ఘనంగా నిర్వహించాలని, అనుబంధసంఘం ఉన్న ప్రతిచోటా ఏఐటీయూసీ జెండా స్థంభాన్ని ఏర్పాటు చేయాలని, అందుకు తగిన ప్రణాళికను రాష్ట్ర సమితులు రూపొందించాలని కోరారు. దేశంలోని తొలి కార్మికసంఘంగా ఏఐటీయూసీ సాగించిన పోరాటాలను , సాధించిన విజయాలను కార్మికవర్గానికి వివరించాలని , కార్మిక సమస్యల పరిష్కారం కోసం జరిగే పోరాటాల్లో నిరంతరం ముందుండాలని వినయ్ విశ్వం పిలుపు ఇచ్చారు.ఎన్ని సంఘాలున్నా ఏఐటీయూసీ మాత్రమే తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్న నమ్మకాన్ని కల్గించి కార్మికుల హృదయాలను గెలుచుకోవాలని ఆయన హితవు పలికారు. విద్యార్థులు, యువత, మహిళలు, దళితులు, ఆదివాసీలు తమ హక్కులకోసం చేస్తున్న పోరాటాలకు కార్మికవర్గం మద్దతు ఇవ్వాలని, వారి పోరాటాలతో మమేకం కావాలని కోరారు. నవంబరు నుంచి అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం, ఇప్టా సంయుక్తంగా చేపట్టనున్న ప్రచార జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఏఐటీయూసీ శ్రేణులు పూర్తి అండదండలు అందించాలని వినయ్ విశ్వం పిలుపు ఇచ్చారు . ప్రధానకార్యదర్శి అమర్ జీత్ కౌర్ సమావేశాల ముగింపులో మాట్లాడుతూ జనరల్ కౌన్సిల్ తీర్మానాలను, నిర్ణయాలను అమలు చేయడానికి రాష్ట్రసమితులు , అనుబంధ జాతీయ ఫెడరేషన్లు పూనుకోవాలని విజ్ఞప్తి చేశారు. మూడు రోజుల జనరల్ కౌన్సిల్ సమావేశాల్లో సుమారు అరవై మంది ప్రతినిధులు చర్చల్లో పాల్గొనగా , అనేక తీర్మానాలను ఆమోదించారు.

చంద్రబాబుకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

కస్టడీలోనే ఉన్నారని గుర్తుచేశారు. దీంతో సీఐడీ విచారణకు తాను సహకరించినట్లు జడ్జికి చంద్రబాబు చెప్పారు. ఈ విచారణలో కొత్తగా ఏం బయటపెట్టారో చెప్పాల్సిందిగా చంద్రబాబు కోరగా... అలా తెలపడం కుదరదని, ఇప్పటికే ప్రాథమిక సాక్ష్యాలను తమకు సీఐడీ అధికారులు అందజేశారని జడ్జి హిమబిందు చెప్పారు. అనంతరం చంద్రబాబును ఈనెల 24వ తేదీ నుంచి అక్టోబరు 5వరకు జ్యుడిషియల్ కస్టడీకి తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

చంద్రబాబు కస్టడీ పొడిగింపునకు సీఐడీ పిటిషన్

చంద్రబాబు కస్టడీని పొడిగించాలని విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ అధికారులు ఆదివారం సాయంత్రం పిటిషన్ వేశారు. దీనిపై చంద్రబాబు తరపు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ కస్టడీపై ఎలాంటి విచారణ కొనసాగలేదు. సోమవారం చంద్రబాబు బెయిల్‌పై వాదనలు కొనసాగనున్నాయి. కాగా అమరావతి రాజధాని అవుటర్ రింగ్‌రోడ్డు, ఫైబర్ గ్రిడ్‌కు సంబంధించిన కేసుల్లో సీఐడీ అధికారులు వేసిన కస్టడీ పిటిషన్లతోపాటు తాజా కస్టడీ పొడిగింపు పిటిషన్‌పై వాదనలు జరగనున్నాయి. మరోవైపు వరుసబెట్టి పిటిషన్లు దాఖలు చేస్తున్న చంద్రబాబు న్యాయవాదులపై జడ్జి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఒకే అంశంపై అనేక పిటిషన్లు వేయడం వల్ల కోర్టు సమయం వృథా అవుతుందని వారికి సూచించినట్లు సమాచారం.

బాబు అరెస్టు అప్రజాస్వామికం

ఒకరోజు నిరశన దీక్షలో చలసాని, మోత్కుపల్లి

విశాలాంధ్ర-హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ అప్రజాస్వామికమని ఆంధ్రా మేధావుల ఫోరం నాయకుడు చలసాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు, సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు గొంటి కుమార్ చౌదరి యాదవ్ అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆదివారం ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మాజీ సీఎంను అరెస్టు చేయడం రాజకీయ కక్షలో భాగమే అని విమర్శించారు. రాజకీయాలకు అతీతంగా చంద్రబాబు అరెస్టును ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటివి ఆక్షేపణీయమన్నారు. చంద్రబాబు అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై 2021లో కేసు నమోదైతే ఎఫ్ఐఆర్‌లో పేరు లేని వ్యక్తిని నాలుగేళ్ల తర్వాత అరెస్ట్ చేయించిన ఘనత ఏపీ సీఎం జగదేనని మోత్కుపల్లి ఎద్దేవా చేశారు. జగన్ విధానాలను చూసి ప్రజలు నవ్వుతున్నారని, వచ్చిన అధికారాన్ని కాపాడుకోలేని అసమర్థుడని ఎద్దేవా చేశారు. జగన్ దుర్మార్గానికి వ్యతిరేకిస్తున్నట్లు మోత్కుపల్లి తెలిపారు. చంద్రబాబు అరెస్టును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖండించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఎం.శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.

బాపట్ల ముస్తాబు

(మొదటి పేజీ తరువాయి)

మహాప్రదర్శన, భారీ బహిరంగ సభ జరగనుంది. మహాసభల కోసం బాపట్లలో భారీ ఏర్పాటు చేపట్టారు. ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది వ్యవసాయ కూలీలు తరలిరానున్నారు.సుదూర ప్రాంతాల నుంచి ఆదివారం మధ్యాహ్నమే శ్రమజీవులు బయలుదేరారు. ఈ సభలకు సీపీఐ రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు హాజరవుతున్నారు. ఈ మహాసభల విజయవంతం కోసం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు జేబీ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగర కొండ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, పాతబస్టాండ్ సెంటర్, తప్పకాలువ, చీలురోడ్ సెంటర్ తదితర రోడ్లు, కూడళ్లలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాలు, తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు పెద్దఎత్తున ఏర్పాటు చేశారు. బహిరంగ సభావేదిక వద్ద కార్మికులు సభను వీక్షించేందుకు తగు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివస్తున్న కష్టజీవులకు మధ్యాహ్నం భోజనాలు, తాగునీరు, తదితరాలను ఆహ్వాన సంఘం సమకూరుస్తోంది. సోమవారం సాయంత్రం మూడు గంటలకు బాపట్ల- గుంటూరు రోడ్డులోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం నుంచి సాగుభూములు, ఉపాధి, సామాజిక న్యాయం సాధన నినాదంతో కూలిదండు మహాప్రదర్శన జరుగుతుంది. 26,27 తేదీల్లో పట్టణంలోని అన్నం సతీష్‌ప్రభాకర్ కాపుకళ్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరుగుతుంది. ఈ మహాసభలలో భవిష్యత్తు కార్యాచరణతో పాటు నూతన నాయకత్వాన్ని ఎన్నుకోనున్నారు. ఈ కూలిదండు మహా ప్రదర్శన, బహిరంగ సభకు ప్రధాన ఉపన్యాసకులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, బీకేఎంయూ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉపన్యాసకులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.వెంకటరావు తదితరులు హాజరవుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో జరుగుతున్న ఈ మహాసభలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పేదలకు సాగుభూమి,ఉపాధి, సామాజిక న్యాయం కోసం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాలు జరిగాయి. దున్నే వాడిదే భూమి అనే నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక పోరాటాలు చేసి వేలాది ఎకరాలు వ్యవసాయ కార్మికులకు పంచడం జరిగింది. కార్మికులకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, విద్యా, వైద్యం పోరాడిన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం. ఈ మహాసభలలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చిం చర్చించి తీర్మానాలు ఆమోదించనున్నారు. భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు.

1న తెలంగాణకు ప్రధాని రాక

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ అక్టోబర్ 1న తెలంగాణలో పర్యటిస్తారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేటలో సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ సంస్థకు శంకుస్థాపన చేస్తారని, ఆపై పాలమూరు సభలో పాల్గొంటారన్నారు. రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా నిరుద్యోగులకు న్యాయం జరగడం లేదని, ఉద్యోగాల భర్తీలో టీఎస్‌పీఎస్సీ విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగులు అప్పు చేసి కోచింగ్ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

కేంద్రంపై వైసీపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టండి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

విశాలాంధ్ర- విశాఖ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందుతూనే ఏమీ అందడం లేదని అధికార పార్టీ రాష్ట్ర నాయకులు విమర్శిస్తున్నారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి అన్నారు. ఆదివారం కైలాసపురంలో జరిగిన శంఖ్‌నాధ్ సోషల్ మీడియా వలంటీర్స్ మీట్‌ను కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ, అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి ప్రసంగిస్తూ... దేశానికి ప్రధాని మోదీ చేస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని... అదే సమయంలో ఏపీకి కేంద్రం ఏమీ చేయలేదన్న వైసీపీ అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పోలవరం, ప్రత్యేక హోదా తరగతి విషయంలో జరుగుతోన్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రత్యేక హోదాకు సరిసమానమైన ప్యాకేజీని ఇస్తామని చెబితే అప్పటి ప్రభుత్వం అంగీకరించిందని, అందుకు బీజేపీని తప్పుబట్టడం సరికాదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వడానికి కేంద్రం అంగీకరించిందని... బిల్లులు సకాలంలో ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని తెలిపారు. డయాఫ్రమ్ వాల్ డిజైన్ లోపానికి కేంద్రాన్ని ఎలా బాధ్యులను చేస్తారని ఆమె ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్ విషయంలో కూడా కేంద్రాన్ని తప్పుబడుతున్నారని, పెట్టుబడులు ఉపసంహరణకు తాము అధికారంలోకి రాక ముందే ఒక మంత్రిత్వ శాఖ కూడా ఉందన్న విషయం మర్చిపోరాదన్నారు. స్టీల్ ప్లాంట్ పెట్టుబడుల ఉపసంహరణ జరిగితే సిబ్బంది భవిష్యత్తు బాధ్యత తమపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఏపీలో కక్ష పూరిత రాజకీయాలు చూస్తున్నామని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి వైసీపీ ప్రభుత్వం నెట్టేసిందన్నారు. అలాంటివి ఏమీ లేదని ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కప్పి పుచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలతో నాణ్యత లేని మద్యం తాగించి... తద్వారా వచ్చిన ఆదాయాన్ని దోచుకుంటున్నారని ఆమె ఆరోపించారు. భవిష్యత్తుపై భయంతో యువత ఏపీ నుంచి తరలిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలో జరుగుతోన్న పరిణామాలను, వాస్తవ విషయాలను అందించడంలో సోషల్ మీడియాకు ప్రధాన భూమిక ఉందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు కొత్తగా మహిళా రిజర్వేషన్ బిల్లు మాదని కొందరు మాట్లాడుతున్నారని, అలా అయితే అప్పట్లోనే చట్టం ఎందుకు చేయలేదని ఆమె ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు , శంఖ్‌నాథ్ 6 రాష్ట్రాల ఇంచార్జ్ దావల్ పటేల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్కిల్ కుంభకోణంపై లోకేశ్ అసత్య ప్రచారం

ఎంపీ విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ కుంభకోణం కేసులో చంద్ర బాబు అడ్డంగా దొరికిపోయినా, తన తండ్రి ఏ తప్పూ చేయకుండానే జైలు పాలయ్యారని ఢిల్లీలో లోకేశ్ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని రాజ్యసభ సభ్యులు, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి ఆరోపిం చారు. సోషల్ మీడియా వేదికగా ఆదివారం అనేక అంశాలపై ఆయన మాట్లాడారు. రూ.371 కోట్ల స్కిల్ కుంభకోణానికి ఆది, అంతం చంద్రబాబు నాయుడేనని స్పష్టమవుతోందని చెప్పారు. ఫైళ్లపై 13 చోట్ల చంద్రబాబు, 2 చోట్ల అచ్చెన్నాయుడు సంతకాలు చేసి నిధులు విడుదలకు అధికారులపై ఒత్తిడి తెచ్చారని వివరించారు. ఈ వివరాలతో కూడిన కాపీని సీఐడీ అధికారులు చంద్రబాబుకూ ఇచ్చారన్నారు. ఢిల్లీ వెళ్లి ఆర్తనాదాలు చేస్తున్నవారికి, కొవ్వొత్తుల ప్రదర్శకులకు చంద్రబాబు సంపాదన రహస్యం ఏమిటో తెలియదా అని ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.371 కోట్ల స్కిల్ కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు.

రోడ్డును తవ్వారు...వేయడం మరిచారు

- కొత్త రోడ్డు శిలాఫలకానికే పరిమితం
- ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి నోచని వైనం
- తెల్లవారిగూడెంలో గోతుల రోడ్డుపై నాట్లు వేసి నిరసించిన గిరిజనం

విశాలాంధ్ర-వీఆర్‌పురం: రోడ్డును పునర్మిస్తామంటూ ఉన్న రోడ్డును తవ్వేసి... ఆనక రోడ్డు వేయకుండా వదిలేయ డంతో అనేక గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వర రామచంద్రా పురం మండలం పెదమట్టపల్లి నుంచి నర్సింగ పేట వరకు ఉన్న రహదారి నిర్మాణానికి నోచుకోకపోవడం, పునర్నిర్మాణం పేరుతో ఉన్న రోడ్డుని తవ్వి పాడుచేయడంతో అక్కడి ప్రజలు ఇటీవల వినూత్నంగా నిరసన తెలిపారు. తెల్లంవారిగూడెం వాసులు... కుందులూరు మాజీ సర్పంచ్ తెల్లం కన్నమ్మ అధ్వర్యంలో రోడ్డుపై ఉన్న బురదలో వరి నాట్లు వేశారు. ఇది మా రోడ్డుకు పట్టిన దుస్థితి అని ప్రభుత్వ తీరును ఎండ గట్టారు. ఎన్ని సంవత్సరాలు ఈ బాధలు పడాలి? ఇదేనా గిరిజనుల పట్ల మీ ప్రేమ? ఇదేనా గిరిజనుల అభివృద్ధి అంటూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెద్దమట్టపల్లినుంచి తెల్లంవారిగూడెం మీదుగా నర్సింగపేట వరకు ఉన్న రోడ్డు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని గిరిజనులు ముక్తకంఠంతో వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే... ఇక్కడ రహదారి నిర్మాణా నికి మూడేళ్ల క్రితం పెద్దమట్టపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అధ్వర్యంలో రంపచోడవరం నియోజక వర్గం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా రూ.4 కోట్ల 33 లక్షల వ్యయంతో 16.2 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు శంకుస్థాపన చేశారు. నేటికీ రహదారి నిర్మించకపోగా... మంచిగా ఉన్న రోడ్డు ను అడ్డగో లుగా తవ్వి అసలు దారికూడా లేకుండా చేశారని తెల్లంవారి గూడెం గిరిజన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న రహదారి తవ్వి వదిలేసి నందున అడుగడుగునా మోకాటి లోతు బురద గోతులతో నిండిపోయిందని... 20కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రం వీఆర్ పురానికి రాకపోకలు సాగించేందుకు చుట్టు పక్కల ఉన్న గిరిజన గ్రామాల నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ సమస్యపై మాజీ సర్పంచ్ తెల్లం కన్నమ్మ మాట్లాడుతూ... కొద్దో గొప్పో కాస్తా మంచిగా ఉన్న రోడ్డును కొత్త రోడ్డు నిర్మాణం కోసం తవ్వి వదిలేశారన్నారు. ఫలితంగా మండల కేంద్రానికి వైద్యం కోసం వెళ్లాలంటే నానా పాట్లు పడాల్సి వస్తోందన్నారు. సుమారు 16 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డుమీదుగా నిత్యం ప్రయాణాలు చేస్తారని... ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, పేషెంట్లను ఆస్పత్రికి తీసుకెళ్లడం కష్టసాధ్యంగా మారిందన్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎవరూ పట్టించుకోవడంలేదు

ఈ రోడ్డు విషయంలో అనేక మార్లు అధికారులను, ప్రజా ప్రతినిధులను అడిగినా... ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు గుండా సుమారు 16గ్రామాలు గిరిజనులు ప్రయాణం చేస్తారు. మూడేళ్లు పూర్తి అయినా నేటికీ నిర్మాణము చేయలేదు. ప్రజా రవాణా వ్యవస్థ కుంటుపడింది. వ్యవసాయ పనులుకోసం వెళ్లాలన్న రోడ్డు పూర్తిగా గోతులు పడటంతో ఇబ్బందులు పడుతున్నాము. ఇకనైనా ప్రభుత్వం రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి.

తెల్లం తమ్మయ్య, తెల్లవారిగూడెం

గోతుల మయం

మూడు సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం జరకపోవడంతో రోడ్డంతా గోతుల మయంగా మారింది. మండల కేంద్రానికి వెళ్లాలంటే వాహనాలు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. ఇక్కడి గిరిజనులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు బాగోలేక మా గ్రామానికి అంబులెన్స్ కూడా రావడం లేదు. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్న కనీసం 108, 104 వాహనాలు ఈ రోడ్లో రానటువంటి పరిస్థితి. ఇప్పటికైనా మా గోడు ఆలకించండి. వెంటనే రహదారిని నిర్మించాలి.

తెల్లం అప్పారావు, తెల్లంవారిగూడెం

బుద్ధవచనాన్ని బ్రహ్మీ లిపిలో అక్షరబద్ధం చేసిన ఘనత శ్రీలంకదే

- బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య
- మాతలె బౌద్ధ గుహల సందర్శన

అనూరాధపురం/ హైదరాబాద్: బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య, బుద్ధవనం ప్రాజెక్టు బుద్ధిస్ట్ ఎక్స్పర్ట్ కన్సల్టెంట్ డా. ఈమని శివనాగిరెడ్డి శ్రీలంకలో పర్యటించారు. అశోక సామ్రాట్ సమకాలికుడైన శ్రీలంక రాజు దేవానాంపియ తిస్స అధ్వర్యంలో, అప్పటివరకు మౌఖిక సాహిత్యంగా ఉన్న బుద్ధ వచనాన్ని తొలిసారిగా తాళపత్రాలపై లిఖించిన మాతలె బౌద్ధ గుహల్ని లక్ష్మయ్య ఆదివారం సందర్శించారు. బుద్ధ వచనాన్ని (త్రిపీటకాలను) బ్రహ్మీ లిపిలో అక్షర బద్ధం చేసిన ఘనతను శ్రీలంక దక్కించుకుందని, ఆ తర్వాతే సూత్ర, వినయ, అభిధమ్మ పిటకాలు మనదేశంలో అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. తెలుగు నేలకు చెంది, శ్రీలంక బౌద్ధ సంఘ నాయకునిగా ఎన్నుకోబడిన క్రీ.శ. 5వ శతాబ్దానికి చెందిన ఆచార్య బుద్ధఘోషుడు కూడా మాతలే బౌద్ధ గుహలో కొంతకాలం నివసించి, విశుద్ధిమగ్గ అన్న బౌద్ధ గ్రంథాన్ని రాశారని...ఆచార్య బుద్ధఘోషుని పేర ఒక పాఠశాలను ఇప్పటికీ నిర్వహిస్తున్న శ్రీలంక బౌద్ధుల్ని ఆయన అభినందించారు. క్రీ.పూ. 3వ శతాబ్దినాటి మాతలే గుహలను తొలచిన తీరును, అక్కడ లభించిన పురాతన వస్తువులను శివనాగిరెడ్డి పరిశీలించారు. అనూరాధపురం మహావిహార ప్రధాన భిక్షువు, జ్ఞానతిలకథెరొను కలిసిన మల్లేపల్లి లక్ష్మయ్య... ఆయనను బుద్ధవనానికి ఆహ్వానించారు. బుద్ధవనం ప్రత్యేకతలను వివరించిన లక్ష్మయ్య, శివనాగిరెడ్డి లకు మహావిహార జ్ఞాపికలను అందించి, త్వరలో బుద్ధవనం సందర్శిస్తానని జ్ఞానతిలక తెలిపారని లక్ష్మయ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శ్రీలంక సెంట్రల్ కల్చరల్ ఫండ్ డైరెక్టర్ జనరల్ ఆచార్య గామిని రణసింఘె పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన దిశా నిర్దేశం అవశ్యం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్

విశాలాంధ్ర-తాడేపల్లి: విద్యార్థులకు నేర్పాల్సినది వేగంగా లక్ష్యాలను సాధించు కోవడం కాదు వాటి దిశగా సరైన పద్ధతిలో పయనించడమని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ అన్నారు. స్థానిక కేఎల్ డీమ్డ్ యూని వర్సిటీలో ఆదివారం ఏపీ ప్రైవేటు అన్ ఎయిడెడ్ పాఠశాలల అసోసియేషన్ (అపుస్మ) సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి సురేశ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీటెక్, ఎంటెక్ చదివిన వారు ప్రభుత్వ శాఖల్లో అటెండర్ ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవడం ఆందోళన కరమన్నారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇందుకు ప్రైవేటు పాఠశాలల సహకారాన్ని ఆయన కోరారు. అనుమతుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగవలసిన దుస్థితి ఉండబోద న్నారు. ఈ సమావేశానికి అపుస్మ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రామచం ద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.తులసి విష్ణుప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేటు స్కూళ్లే ఎక్కువ ఉత్తీర్ణ శాతం, గ్రేడ్లు సాధిస్తున్నాయని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు అనువైన పరిస్థితులు రాష్ట్రంలోఉన్నాయని అన్నారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానం సాదించిన అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పుట్టా సాయి శ్రావణి, రాజమండ్రికి చెందిన ప్రతిబల నాగ సాయి, కడప జిల్లాకు చెందిన నవ్యశ్రీ, రెండు, మూడవ స్థానాల్లో నిలిచారు. కడప జిల్లాకు చెందిన షేక్ రజియాఫాతిమాతో పాటు మరో తొమ్మిది మందిని సురేష్ కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు టి.కల్పలత, పి.చంద్ర శేఖర్ రెడ్డి, నిషా అధ్యక్షులు కుల్భుషన్ శర్మ, కేఎల్ వర్శిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ జి.పార్థ సారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ వెంకట్ రామ్ పాల్గొన్నారు.

బాబుకు ఐటీ ఉద్యోగుల సంఘీభావం

- హైదరాబాద్ నుంచి రాజమండ్రికి కార్ల ర్యాలీ
- పోలీసుల అత్యుత్సాహం... అడుగడుగునా తనిఖీలు
- కంగు తిన్న సాధారణ ప్రయాణికులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ కార్ల ర్యాలీ చేపట్టిన ఐటీ ఉద్యోగులు... పోలీసుల అడ్డంకులను, నిర్బంధాలను దాటుకుని రాజమండ్రికి చేరుకున్నారు. అనంతరం రాజమండ్రిలో బస చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణిని వారు కలిసి సంఘీభావం తెలిపారు. చంద్రబాబును అరెస్టు చేయడంపై ఐటీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అడ్డంకులను దాటుకుని చంద్రబాబుపై అభిమానంతో ఇంత దూరం వచ్చారంటూ వారందరికీ బ్రాహ్మణి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగులపై పోలీసుల ఆంక్షలు దారుణమని ఆమె ఖండించారు. ఇక చంద్రబాబుకు మద్దతుగా ఐటీ ఉద్యోగులు హైదరాబాద్ నుంచి రాజమండ్రికి తలపెట్టిన కార్ల ర్యాలీకి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఆదివారం తెల్ల వారుజామునుంచే ఐటీ ఉద్యోగులు కార్ల ర్యాలీతో బయల్దేరారు. దీంతో అప్రమత్తమైన ఏపీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. చంద్రబాబును సీఐడీ అధికారులు విచారిస్తుండటంతో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకూడదనే సాకుతో ఏపీ, తెలంగాణ సరిహద్దులోని గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు భారీగా మోహరించి, వాహనాలను తనిఖీ చేశారు. ఆయా వాహనాల్లో ఐటీ ఉద్యోగులు లేరని నిర్ధారించుకున్నాక వాటిని వదిలేశారు. ఈ తనిఖీలతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. వారాంతపు సెలవుల్లో భాగంగా హైదరాబాద్ నుంచి ఏపీకి ఉద్యోగులు, ప్రజలు, వ్యాపారస్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ తరుణంలో అన్ని వాహనాల్ని తనిఖీ చేయడంతో వాహనదారులు అసౌకర్యానికి గురయ్యారు. పోలీసుల వైఖరిని వారు తప్పుబట్టారు. శనివారం నుంచే ఈ తనిఖీల్ని కొనసాగించడంపై టీడీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐటీ ఉద్యోగుల ర్యాలీకి అనుమతి లేదంటూ విజయవాడ నగర పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా ప్రకటించారు. విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా నుంచి రాజమహేంద్రవరం వరకు ఉన్న జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా జిల్లాల సరిహద్దుల్లోనూ పోలీసులు నిఘా ఉంచి, కార్లను తనిఖీ చేశారు. అయినప్పటికీ అనేక కార్లలో ఐటీ ఉద్యోగులు రాజమహేంద్రవరానికి చేరుకున్నారు. టీడీపీ జెండాలతో ప్రదర్శనగా తరలివెళ్లారు.

5న విశాఖలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సమావేశం అక్టోబరు 5న విశాఖపట్నంలోని సీపీఐ జిల్లా కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరగనుంది. ఈ మేరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్ బాబు ఆదివారం ఒక ప్రకటన చేశారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జాతీయ నాయుకలు జి.ఈశ్వరయ్య పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ శాఖలో ఖాళీల భర్తీ కోసం ఆందోళనలు, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, ఆన్‌లైన్ యాప్‌లతో నష్టాలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తామని నేతలు పేర్కొన్నారు.

రాజకీయశక్తిగా ఎదగాలి

బహుజనులకు సతీశ్ చందర్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన కుల వ్యవస్థ నిర్మూలనకు చర్యలు అవసరమని ప్రముఖ పత్రికా సంపాదకులు సతీశ్ చందన్ అన్నారు. దళిత బహుజనలు రాజకీయ శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. బ్లూ వింగ్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో ఆదివారం విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో 'చెంచాలే నేతలైతే' అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా సతీశ్ చందర్ హాజరయ్యారు. మనువాద పార్టీలు దళిత, బహుజనులతో చేస్తున్న కుల రాజకీయాలకు అంతం పలకాలని పిలుపునిచ్చారు. అధికారం ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కరం సాధ్యమన్నారు. దళిత, బహుజనులు ఐక్యంగా తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోసం అడుగులు వేయాలని సూచించారు. సదస్సులో బ్లూ వింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి మల్లికార్జున్, ప్రధాన సలహాదారు శివరామకృష్ణ పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్, కాన్షీరామ్‌కు సతీశ్ చందర్, దళిత సంఘాల నేతలు నివాళులర్పించారు.

పుచ్చలపల్లి సుందరయ్య

గుజ్జుల యలమందారెడ్డి

చంద్ర రాజేశ్వరరావు



బొమ్మగాని ధర్మబిక్షం



కోండ్రు సుబ్బారావు

స్వర్ణ వేమయ్య

చల్లపల్లి నారాయణరావు

కాబోతు రామస్వామి

తురిమెళ్ల గోవిందయ్య

గొరికపూడి జోసెఫ్

జె.ఎస్.ఆర్.ఆంజనేయశాస్త్రి

వంక సత్యనారాయణ

రజబ్ అలీ

భూపతి వెంకటనర్సయ్య

బడుగు జీవులకు భరోసా

- గ్రామీణ పేదల ఆత్మగౌరవం, రక్షణ, అభివృద్ధి సంక్షేమమే ధ్యేయం
- అమరవీరుల త్యాగం, స్ఫూర్తితో పోరాటాలకు సమాయత్తం
- నేటి నుంచి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న మన రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. గిరిజనులు, దళితులు, మైనారిటీలు, వెనుకబడిన కులాల పేదలు చెమటోడ్చి కష్టించి పనిచేసే శ్రమే దేశ సంపదకు మూలం. కరువు కోరల్లో కొట్టుమిట్టాడుతూ తరతరాలుగా అణచివేతకు గురవుతూ అంటరానితనంలాంటి సాంఘిక పీడన, న్యాయమైన కూలిరేట్లు ఇవ్వని భూస్వామ్య పెత్తందారీ దోపిడీల నుంచి విముక్తి కోసం 'మనిషిని మనిషిగా చూడాలని' 'సాంఘిక న్యాయం కోసం' 90 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన వ్యవసాయ కూలీ సంఘం... తెలుగునాట ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘంగా విస్తరించింది. జమిందారీ, జాగీర్దారి విధానాల రద్దుకు, భూస్వామ్య పెత్తందారీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా న్యాయమైన కూలీరేట్ల సాధనకు, భుక్తి కోసం, సామాజిక గౌరవం కోసం 'దున్నేవాడిదే భూమి' అనే నినాదంతో నైజాం నవాబు నిరంకుశ పాలనకు, భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామీణ శ్రమ జీవులను సమీకరించి, వారిని చైతన్యపరచి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనేక మహోద్యమాలను నిర్వహించి విజయాలను సాధించింది.

గ్రామీణ బడుగు జీవుల సమస్యల పరిష్కారానికి నేటికీ పెద్దదిక్కుగా, అండగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రపంచంలోనే మొట్టమొదటి గ్రామీణ పేదల రక్షణ, సంక్షేమం కోసం ఏర్పడిన సంఘంగా గుర్తింపు పొందింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితి సమాచార పత్రంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘానికి స్థానం లభించడం గర్వకారణం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు బాపట్లలో జరుగుతున్న సందర్భంగా సంఘ నిర్మాతల గొప్ప త్యాగనిరతిని గుర్తుచేసుకోవడం ఎంతో అవసరం. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం స్ఫూర్తితో అమరులు చంద్ర రాజేశ్వరరావు సీపీఐ ప్రధాన కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక ఉద్యమనేత అమరులు గుజ్జుల యలమందారెడ్డి తోడ్పాటుతో దేశవ్యాపితంగా గ్రామీణ కష్టజీవులకు సంఘ నిర్మాణం చేయాలనే శాస్త్రీయ, సమగ్ర ఆలోచనచేసి దేశంలోనే మొట్టమొదటిగా భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ)ను ఏర్పాటు చేశారు. తర్వాత 1969, 1971లో దేశవ్యాప్తంగా ప్రత్యక్ష భూపోరాటాలు నడిపి నిరుపేదలకు భూములు పంపిణీ చేయాలనే ఆలోచనను జాతీయ ఎజెండాలో తీసుకురావడంలో బీకేఎంయూ ప్రధాన పాత్ర వహించింది. ఈ సంఘం కృషి ఫలితంగానే వివిధ రాష్ట్రాలలో భూసంస్కరణ చట్టాల ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది.

రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల సమస్యలపై ముఖ్యంగా సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టం కోసం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, కోనేరు రంగారావు భూ కమిటీ చేసిన... ప్రభుత్వం ఆమోదించిన సిఫార్సుల అమలు, అధిక ధరల అదుపు కోసం, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల నియంత్రణకు, ఆహార భద్రత కోసం, ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, రేషన్ కార్డులు, పెన్షన్లు, విద్య, వైద్యం, రక్షిత తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర నివాస మౌలిక సౌకర్యాల కల్పన కోసం వ్యవసాయ కార్మిక సంఘం అహర్నిశలు శ్రమిస్తూనే ఉన్నది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, వ్యవసాయ కూలీలకు రక్షణ, ఆత్మగౌరవం కల్పించేందుకు కొండంత అండగా నిలబడుతూనే ఉంది. సాధించుకున్న చట్టాలను కాపాడుకోవడానికి, సంక్షేమ పథకాల సక్రమ అమలుకు మొక్కవోని దీక్షతో పోరాడుతోంది.

అన్ని రకాల ప్రభుత్వ బంజరు భూములు, మిగులు భూముల కోసం ప్రత్యక్ష భూపోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాలను కష్టజీవులకు పంపిణీచేయించింది. చట్టబద్ధంగా భూస్వాముల మిగులు పేదలకు దక్కాలని, భూ సంస్కరణల యాత్రలు నిర్వహించి చట్టంగా సాధించిన ఘనత ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘానికే దక్కింది. నేటికీ భూ పోరాటాలను నిరంతరం కొనసాగిస్తూ వాటి ఫలితాలు గ్రామీణ కష్టజీవులకు అందిస్తున్నది.

ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలతో కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో అమరులు పుచ్చలపల్లి సుందరయ్య, గుజ్జుల యలమందారెడ్డి, చంద్ర రాజేశ్వరరావు, బొమ్మగాని ధర్మభిక్షం, కోండ్రు సుబ్బారావు, స్వర్ణ వేమయ్య, చల్లపల్లి నారాయణరావు, కాబోతు రామస్వామి, తురిమెళ్ల గోవిందయ్య, గొరికపూడి జోసఫ్, జేఎస్ఆర్ ఆంజనేయశాస్త్రి, వంక సత్యనారాయణ, రజబ్ అలీ, భూపతి వెంకట నర్సయ్య, గుండా మల్లేష్, ఎన్. ఈశ్వరరెడ్డి, పెనకలపాటి వెంగమనాయుడు, వేములపల్లి శ్రీకృష్ణ, బావిరెడ్డి వెంకటేశ్వరరావు, పెరవలి శ్రీరాములు వంటి ఎందరో మహానుభావులు నిర్మించిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలు జరుపుకుంటున్నాం. 5 లక్షల సంఘ సభ్యత్వానికి నాయకత్వం వహిస్తున్న, వివిధ ఉద్యమాల్లో రాటుదేలిన 500 మంది ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర నాయకులు ఈ మహాసభల్లో పాల్గొంటారు. వ్యవసాయ కార్మిక, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీల సమస్యలపై, ముఖ్యంగా ఉపాధి, సాగుభూములు, సామాజిక న్యాయం కోసం చేసే పోరాటాలకు ఈ మహాసభ వేదిక కానున్నది.

బావిరెడ్డి వెంకటేశ్వరరావు

పెదవల్లి శ్రీరాములు

గుండా మల్లేష్

నర్రెడ్డి ఈశ్వరరెడ్డి

పెనకలపాటి వెంగమనాయుడు

వేములపల్లి శ్రీకృష్ణ

(బాపట్ల వేదికగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘ 22వ రాష్ట్రమహాసభలు సందర్భంగా)

బాపట్లకు తరలిరండి

పల్లవి:
రండి రండి రండి రండి బాపట్ల రండి అందరు కలసి రారండి.
వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర మహా సభలకు-
మీరు బారులు తీరండీ.

చరణం-1 :
ఎందరో అమరుల త్యాగం
ఉద్దండులు నడిపిన సంఘం
హక్కుల సాధన కొరకు
ఎక్కుపెట్టిన బాణం
చిందిన చెమట సాక్షిగా
కదంతొక్క మంది
కష్టం వృధా పోదు అంది..................."రండి"

చరణం -2 :
మట్టిని పట్టిన చేతులు.
కాడి మేడి ఎద్దులు
సాలును తొక్కిన అడుగులు
వెన్నును తాకిన ఎండలు
చాలి చాలని బ్రతుకులు
కసిగ కదల మంది
కధనం ఆపవద్దు అంది....... "రండి"

చరణం -3 :
నడుమును దోపిన చెంగులు
కోతను కోసిన కొడవలి
మోతలు మోసిన వీపులు
కల్లం రాలిన గింజలు
గంజే దక్కని కడుపులు
పిడికి లెత్తమంది
కూలిదండై కదల మంది........ "రండి"

దేవరకొండ శ్రీనివాస్

సాహితి

జన హృదయ విజేత 'నాజర్'

డా॥ కత్తి పద్మారావు ,
9849741695

ఆకలి, అవమానం, దరిద్రం, దుఃఖం, కష్టం, సంగీతం ఇవీ నా జీవితం అన్న నాజర్ హిందూ సంస్కృతికి ప్రత్యామ్నాయంగా దళిత కళల్ని ఈ రాజ్యంలో తెలుగు నేలలో పండించిన కళా తేజస్వీ, దళితుల జీవన విధానం కళలకు పుట్టినిల్లు. ఆ కళలలో సహజీవనం, సమైక్యత, సమత, సమరం, సంతోషం, సముత్తేజం దాగున్నాయి. వాటిని ఈ యుగంలో రసావిష్కరణ చేసి వాటికి రంగస్థలాన్ని రూపొందించిన వాడే నాజర్. ఈ సామాజిక కళలను అణచివేయడానికి హిందూ మతవాద, కులవాద కళలు హిందూ దేవాలయాల్ని సృష్టించుకున్నాయి. దీనికి ప్రత్యామ్నాయంగా దళిత సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమ వేదికను పల్లెగుండెల్లో రూపొందించినవాడే నాజర్.

అందుకే నాజర్ ప్రత్యామ్నాయ దళిత సంస్కృతి ఎక్కడోలేదు అది కింది కులాల్లోనే ఉంది. 'నేను అట్టడుగు కులాల సాంస్కృతిక ప్రతినిధుల్లో ఒకడిగా ఎప్పటికి ఉంటాను' అని అన్నారు. ఇలా ప్రకటించుకొన్న నాజర్‌కు ఒక స్పష్టమైన తాత్విక దృక్పథం వుంది. సామాజిక తత్వం వుంది. సాంస్కృతిక పునాది వుంది. కింది కులాలుగా చెబుతున్న దళితులు, కళాజీవులు వారి జీవితం అడుగడుగున కళామయమే. సుఖంలో, దుఃఖంలో, బాధలో, వ్యధలో వారు సంగీతాన్ని, సాహిత్యాన్ని వివిధ కళా రూపాలను ఆశ్రయించారు. నవరసాలు వారి జీవితంలో నిరంతరం ప్రవహిస్తాయి.

దళిత కులాల్లో కళే జీవనంగా బతికే కులాలు వున్నాయి. ఇందులో ప్రధానమైనవారు 'జంగములు' వీరే అసలు బుర్రకథను చెప్పేది. అందుకే ఈ బుర్రకథలను మొదట జంగం కథలనేవారు. వీరినే బుడిగె జంగాలని పిలిచేవారు. ఎందుకంటే వీళ్ళు కథకు "బుడిగె"ను వాయిద్యంగా ఉపయోగించేవారు. ఈ బుడిగెనే 'డక్కీ' అని డిక్కీ అని పిలిచేవారు. బుడగ జంగం వారు ఈ బుర్ర కథకు ఎలా మూలమో నాజర్ వివరించారు. బుడగ జంగంలు లోతైన కళా జీవులు. వారు 'డక్కీని' కనిపెట్టిన తరువాతే కథ పాటగా రగడగా ఒక వరుసలో సాగడం ప్రారంభమైంది. ఈ విషయాన్ని వివరిస్తూ నాజర్ "తెలుగు పాటకు చెందిన బాణీలన్నీ అట్టడుగు కులాల వాళ్ళ దగ్గరే వున్నాయి." ఆ మూలం నుంచి వచ్చిన వాడిని కనుక నేను వెంటనే పట్టుకోగలిగాను. భజన పాటలు, కోలాటం పాటలూ, వీధి భాగవతుల పాటలు, సాయలూ, ఎరుక చెప్పే సింగిసోది బాణీలు, ముస్లిమ్‌ల పెళ్ళిలో వాయించే చిన్న షహనాయల్లో వినిపించే సాయిలూ, కృష్ణ చెంచులు జేగంట వాయిస్తూ ఆలపిస్తూ పాడే సాయిలు, దేవచెంచులు వీణరణం వాయిస్తూ వీర తాళ్ళు మోగిస్తూ పాడే సాయలు వారి ఆడంగులు ముద్దకోసం ఇంటి ఇంటి ముందు పాడేవి. బమినీలు, పంబల, జంకుల, మాదిగోళ్ళ డప్పులు కొట్టుకొంటూ పాడే పాటలూ, ద్యాన్సులు, చిందూ మూడిళ్ళ సాయలు.... ఇలాంటి అట్టడుగు కులాలకు చెందిన గొప్ప కళా సాహిత్య సంపదను అనుసరిస్తూ, అనుకరిస్తూ అవసరమనుకున్న చోట బుర్రకథసాయలో కలుపుతూ వచ్చాను" అన్నారు. నిజానికి నాజరు ఈ మాటల్లో ఎంతో లోతైన దళిత జాతుల కళా చరిత్ర వుంది. నాజర్ చాలా లోతైన సామాజిక జీవనం కలవాడు. అగ్రవర్ణాలుగా చెప్పుకొనే వారెవ్వరూ ఒక యుగాన్ని నడిపించే కళాజీవులు కాలేక పోయారు. నాజర్, గద్దర్ ఇద్దరూ దళిత జాతుల నుండే రావడం మనం గమనించాలి.

నాజర్ జీవిత గాథ చాలా సంఘర్షణతోను పట్టుదలతోను, పోరాటంతోను కూడుకొన్నది. ఆయన బుర్రకథతో వీరరసాన్ని ఆవిష్కరించేటపుడు కొరికే పళ్ళు శబ్దం మైకులో నుండి వినిపించినపుడు తరతరాల బానిసత్వంలో మగ్గుతున్న బడుగు జీవుల గుండెల్లో వీర రసావిష్కృతం చేసి వారిలో ఉగ్రత్వాన్ని కలిగించేది. ఈ విషయాన్ని గూర్చి నాజర్ చెబుతూ "ఈ దుర్భర దరిద్ర జీవితం, కష్టాలు, వాటి కారణాలు నాకు జరిగిన అవమానాలు నా మదిలో పాముల్లా మెదులుతూనే వుంటాయి. తలచుకొని దుఃఖాన్ని దిగమింగుకొని, కసిని పెంచుకొని మైకుద్వారా అందరికి వినిపించేంత గట్టిగా పండ్లు పటపటాకొరికి ఈ రగడను పోరాట ఘట్టంతో నేను పాడితే జనంలో నుంచి రెస్పాన్స్ వచ్చింది. ఇలాంటి రగడలు చెబుతున్నపుడు కొన్ని చోట్ల జనంలో ఉరికిలేస్తుండే వాళ్ళు. వాళ్ళ నెత్తిన నీళ్ళుపోసిన ఊళ్ళుకూడా అనేకం. నాజర్ చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు. ఆయన పలనాటి యుద్ధంలో 'పటపట పళ్ళు కొరుకుతూ' అనే ఘట్టం వచ్చినపుడు కళ్ళు సూర్యగోళాలై కనుబొమ్మలు విల్లంబులై అడుగులో ఒక అద్భుతమైన చిందు వీర రసావిష్కృతంగా ఆయన తాళం వాయిస్తూ దానికి అనుగుణమైన డక్కీలు మోగుతున్నపుడు ప్రజలు ఒక్కసారి ఆవేశానికి గురయ్యేవారు. నిద్రాణమైన వారిలోని చేతన ఒక్కసారి విజృంభించి తమపై పెత్తనం చేయు అగ్రకులాల దౌర్జన్యాన్ని ఎదిరించి పోరాడ గలమన్న ధైర్యాన్ని కలిగించేది. గుండె గుండెలో ఆయన వెలుగు దివ్వెలు వెలిగించేవాడు, జన సందోహంలో ఎర్రని మంటలు రేగేవి. తలపాగల్లో వారు ఎవరి మీసాన్ని వారు ఒకసారి తడిమి చూసుకునేవారు. స్త్రీలైతే కొంగులపై చేయి వేసేవారు. ఇది వారి అతిశయోక్తికాదు. నాజర్ పద ఘట్టనకు లేచిన కళాసమరం పల్లెల్లో పెద్దవాళ్ళు రచ్చబండలపై నిరంతరం వినే కథనం నాజర్ బడుగు జీవుల శరీర ధ్వనిని పసిగట్టారు. వైదిక నాట్య శాస్త్రంలోని వైయక్తిక కళాభ్యసనానికి భిన్నంగా గుంపుకళల గుండెలని నాజర్ పట్టుకున్నారు. అందుకే నాజర్ "వాళ్ళ శరీరంలో వున్నటువంటి ధ్వనికి అనుగుణంగా జాతి సంగీతాన్ని సరైన విధంగా సమన్వయం చేయగలిగినానేమోనని నేను భావిస్తున్నాను. అలాగే నాట్యం కూడా మన గొల్ల భాగవతుల కుప్పీలు, గంతులు, అలాగే యుద్ధ ఘట్టంలో ఎట్లా వుండాలి. రౌద్ర రసాన్ని ఎలా పోషించాలి. బీభత్సాన్ని ఎలా రక్తి కట్టించాలి. నాయకురాలి నాగమ్మను ఏరకంగా ప్రవేశపెట్టాలి. మగువ మంచాలను ఏవిధంగా తీసుకురావాలి. బ్రహ్మనాయుడుని విధంగా నడపాలి వంటి ప్రతి చిన్న విషయాన్ని గురించి కూడా నేనే జాగ్రత్త తీసుకున్నాను. ఆయా పాత్రల నడక దగ్గరనుంచి, కులుకు దగ్గర నుంచి వాళ్ళ హావ భావాలు, మాట్లాడే తీరు అన్నిటి మీద దృష్టిని కేంద్రీకరించి మరింత శక్తిమంతంగా తీర్చిదిద్దటానికి నా శక్తి వంచన లేకుండా కృషి చేశాను" అన్నారు. నాటకంలోని లక్షణాలను, ఏకాంగికలోని లక్షణాలను జానపద భాషల్లో సమన్వయించారు.

నాజర్

నాజర్ పల్నాటి యుద్ధం బుర్రకథలో అద్భుతమైన శిల్పాన్ని ఆయన చూపించారు. సామాజిక సందేశాలతోపాటు, కరుణ వీర రసాలను మహోజ్వలంగా సమన్వయం చేశారు. సుగాలీల నృత్యాలలో వున్న కులుకు నృత్యాలు. ఈ కులుకు నృత్యంలో "గజ్జె"కు ప్రాధాన్యం ఎక్కువ ఈ గజ్జెల మోతను నాజర్ ఇక్కడ నుండే తీసుకొన్నాడు. సుగాలీలు ఒకే గూడెంలో నివసిస్తారు. ఈ గూడాలని 'తండాలు' అని పిలుస్తారు. సుగాలీ స్త్రీలు చేసే నృత్యమే కులుకు నృత్యం. సుగాలీ స్త్రీల వేషధారణ ప్రత్యేకంగా ఉంటుంది. బుర్రకథలో పాడుతూ ఎగరటం అనేది ముఖ్యమైన అంశం. ఇది కింది కులాల కోలాటం, చెక్క భజనలు, స్త్రీల గొబ్బిళ్ళు, జక్కికి మొదలైన వేడుకల్లో పాడే పాటలన్నీ నృత్య గీతాలే ఈ నృత్య గీతాలు. బుర్రకథల్లో రగడలుగా రూపొందాయి. ముఖ్యంగా భజనల్లో ఉన్న 'బిందును' తాళానికి, గజ్జెలను, తంబురకు రగడను సమన్వయించటం బాగా చేశాడు. చెక్క భజనలు, పలకల భజనలు, జటితాళ్ళ భజనలు, వాటిలో వచ్చిన 'గమకాలను' బుర్రకథలో గొప్పగా అన్వయం చేశాడు. నాజర్ వీరశైవులను కూడా జనంలోని కళా రూపాలను బాగా ముందుకు తెచ్చారు. పాల్కురికి సోమన బసవ పురాణంలో చెప్పినట్లు - "తుమ్మెద పదాలు పర్వత పదాలు, వెన్నెల పదాలు, గొబ్బి పదాలు, 'సంజపదాలు' వంటి గీతాలెన్నో ఆనాడు వాడుకలో ఉన్నాయి. అవన్ని ఈనాటికీ దళిత కులాల్లో, వారి జీవన విధానాల్లో సాక్షాత్కరిస్తున్నాయి. వాటిలో ప్రజలనుత్తేజపరిచే అంశాలన్నిటిని నాజర్ బుర్రకథలో సమన్వయించాడు. ఆధునిక యుగంలో వాటి జవజీవాలను ఒడిసిపట్టి బుర్రకథ కళగా ఆయన మలిచారు. ప్రజల జన జీవనంలో దాగున్న శ్రామిక గీతాలను, పిల్లల పాటలని, వేడుక పాటలని, వలపు పాటలని, హాసన గీతాలని, కన్నీటి పాటలని బుర్రకథలో సందర్భోచితంగా పాడిగాడు. అట్టడుగు కులాల వారి జీవితంలోని, దుఃఖరసం ఆయన బుర్రకథలో అంతర్లయగా ప్రవహించింది. అదే సమయంలో వారిలో నిక్షిప్తమైన హాస్యాన్ని నాజర్‌లో వంతగా ఉన్న రామకోటి బాగా పోషించారు. పొట్టచెక్కలయ్యేటట్లు ఆయన నవ్వించేవారు. కష్టజీవులంతా ఒక్కసారిగా వారి కష్టాన్ని మరచిపోయి కడుపారా నవ్వుకునేవారు. అనేక చారిత్రక కారణాల వలన పేదలయిన దళితుల జీవన స్రవంతి సాంస్కృతిక సంపద ఉన్నదనే విషయాన్ని నాజర్ బాగా గమనించారు. "ఈ కళా సంపత్తి అంతా వీరిదే. (యానాది, చెంచుల మొ॥వారి) నేను ప్రతిస్పందించింది వీళ్ళ జీవితాలకే. నేను ప్రతిబింబించింది వీళ్ళ కష్ట సుఖాలనే, నేను నిలబెట్టింది అనేక కళారూపాల్లో ఒకటి మాత్రమే. ఈ గొప్పతనం ఈ గౌరవం అంతా వీళ్ళదే. వీళ్ళకే చెందాలి. గర్భదరిద్రులై సాంస్కృతిక సంపన్నులైన నా జాతికి చెందిన అట్టడుగు కులాల బిడ్డల తరపున నేను ఈ గౌరవాన్ని అందుకున్నాను" అన్నారు.నాజర్ ఏదీ దాచుకోలేదు. తన జీవితాన్ని సంఘర్షణని, తాను గ్రహించిన అంశాలను తనను మోసగించిన తీరును ఆయన అనేక సందర్భాలలో తన సంభాషణల్లో అభివ్యక్తం చేశారు. నాజర్‌కు లోతైన సామాజిక అవగాహనతో పాటు సాహిత్య అధ్యయనం ఉంది. ఆయన కింది కులాల పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకున్నారు. నిజానికి దళిత స్త్రీలే కథా గేయములు కతలుగా పాడేవారు. అందులో నుండి నాజర్ బుర్రకథకు ప్రాణం పోశారు. జక్కులు తెలుగు నేలలో కళావంతులుగా పేరుపొందారు."

కళల కోసం కులాలు రూపొందిన నేలలో కళలు అనుభవించే వాళ్ళు అగ్రకులాలు, కళలను సృష్టించే వారు నీచ కులాలు అయ్యారు. కళ మానవ మస్తిష్కం నుండి సృజనాత్మకంగా వెలువడుతుంది. నాజర్ బుర్రకథ యక్షగానాల నుండి రూపొందిందని స్పష్టం చేశారు. నిజానికి యక్షగానం దేశీ కళలన్నింటికి మూలమైంది. ఆంధ్ర, కర్ణాటక, తమిళ, తుళు భాషలలో ఇది ప్రసిద్ధి చెందింది. అయితే బుర్రకథ మాత్రం తెలుగునేలలోనే ప్రసిద్ధి చెందింది. అది నాజర్ వల్లే జరిగింది. బుర్రకథలోని తందాన తాన'-'తందనాన' అనికాని 'తందనాన' అనికాని ఊత పదము ప్రతి పాదాంతమున ఆవృత్తముగా వస్తుంది. ఇది యక్షగానం నుండే తీసుకున్నారు. నాజరుకు ముందే బుర్రకథ కూడా వున్నప్పటికి దానికి ఒక నిర్దిష్ట కళారూపాన్ని తీసుకోవడంలో నాజర్ ఒక కళా సృష్టికర్తగా వ్యవహరించారు, యక్షగానాల్లో తాళ ప్రధానమైన దరువులు, ద్విపదలు, పద్యము, వచనములు, బుర్రకథకు నాజర్ అన్వయించారు. అందుకే బుర్రకథలోనే ఆయన ప్రవేశ పెట్టిన నాగమ్మ, బహ్మనాయుని పాత్రలు నడిచి వస్తున్నట్లే వుండేవి. తెలుగు నేలలో దళితవాడల్లో దినాలకు, పెండిండ్లకు ఈ బుర్రకథలు చెప్పించుకుంటారు. అయితే ఈ కథలప్పుడు 'నాజర్‌ని తలుచుకోని వారుండరు.నాజర్ ఈ నాటక లక్షణాలన్నీ ఒడిసిపట్టుకుని తానే ఒక కళారూపంగా ప్రజ్వరిల్లాడు.

నిజానికి బుర్రకథ భారతదేశంలో క్రీ.శ 1150 నాటికే జంగమ కథ పేరుతో ప్రచారంలో వుంది. తెలుగు నేలలో దానికి ఒక సమగ్రత సాధించింది. వీటె పట్టింది. నాజర్‌గారే, కోడి పందేలను వర్ణిస్తూ పల్నాటి యుద్ధంలో నాజర్. అందెవేసిన పందెగాండ్లురా సై/ అందమైన పుంజులై తిరి సై/ పాతలు కత్తులు దీసి సై / సానల మీదేసాదిరీ సై/ 'తందానా తందానే' ఊతపదానికి బదులు 'సై. అని పలికి వీరరసాన్ని పోషించారు. ఈ జంగమ గాథలకు ఊతపదాలు కథను బట్టివుంటాయి.రాజకీయోద్యమంలో భాగంగా నాజర్ తీసుకువచ్చిన కష్టజీవి, పల్నాటి యుద్ధం, బెంగాల్ కరువు మొదలగునవి నాజర్ స్వయం సృజనం. అందులో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఉద్ధరింపచేస్తూ బడుగు వర్గాల సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తు తానొక కళా స్రవంతిగా ప్రజలకు కళాలోపాలు తీర్చాడు నాజర్. నాజర్‌కు ముందున్న జంగమల కథలో కళాసృజనం వుండేది కాని స్పష్టమైన సామాజిక దృక్పథం లేదు. వాటిపై కొంత కాలానికి హిందూవాద ప్రభావం పడి 'గాసట బాసట'గా తయారయ్యాయి.

నాజర్ ఈ జంగమ కథలలోని కళను తీసుకొని వాటిలోని అతిశయోక్తులైన సన్నివేశాలను తొలగించి, సామాజిక చారిత్రక-దృక్పథం తోనూ సమకాలీన రాజకీయ అవగాహనతోనూ, బుర్రకథను ఒక సామాజిక ప్రయోజనం కలిగిన సాధనంగా మార్చాడు. కళాకారుడు సమకాలినంగా మలచగలిగినప్పుడే సృజనాత్మకశక్తి కాగలడు. పల్నాటి యుద్ధం నాజర్ సృష్టి. ఈ విషయాన్ని గూర్చి చెబుతూ ఎల్లోరా "దీనిని రచించినది ప్రసిద్ధ బుర్రకథకుడు నాజర్ స్వయంగా రచించుకొని, స్వయంగా కథను చెప్పి పేరు సంపాదించుకున్న ఆంధ్రుడు ఈయనే అనుకొంటాను" పల్నాటి యుద్ధంలో కొన్ని చరణాలు చూస్తే నాజర్ కళా సాహితీ సృష్టి మనకు అవగత మవుతుంది. "ఎక్కువ తక్కువ మత విభేదము/ అక్కర లేదనుచూ/ ఒక్కటి ప్రజలందరుండ తా/ చక్కగ యోచించి/ చాకలి మంగలి మాల మాదిగ/ సర్వజనులకెల్ల / ఏక పంక్తిలో విందు భోజనము/ ఏర్పాటు చేసి/ చాపకూటి సిద్ధాంతం పేరిట/ సాగించే ఘనుడు -" సామాజిక సమైక్యత కోసం బ్రాహ్మణము పేర నాజర్ ఎలుగెత్తాడు. నాజర్‌లో ఒక సామాజిక వైతాళికుడు మనకు దర్శనమిస్తాడు. 'బ్రహ్మనాయుని' పాత్రకు ఆ ఔదార్యం ఔన్నత్యాన్ని నాజర్ తీసుకువచ్చాడు. బ్రహ్మనాయుని "చాపకూటి సిద్ధాంతం" లో ఉన్న కులనిర్మూలన దర్శనాన్ని మహాద్భుతంగా నాజర్ సమాజానికి అందించారు.

అనువాద సాహిత్యంలో మేటి జిల్లేళ్ళ బాలాజీ

ప్రముఖ కథా రచయిత, అనువాదకులు జిల్లేళ్ళ బాలాజీకి అనువాదంలో 'కె.ఎస్.విరుదు' పురస్కారం లభించింది. కోయంబత్తూరులోని 'విజయ రీడర్స్ సర్కిల్', విజయా పబ్లిషర్స్ ద్వారా ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ప్రతి ఏడాది... ఇతర భాషల నుండి తమిళంలోకీ, తమిళం నుండి ఇతర భాషల్లోకి సాహిత్యాన్ని అనువాదం చేసే ఇద్దరికి 'విజయ రీడర్స్ సర్కిల్' 'కె.ఎస్.విరుదు' పురస్కారాన్ని అందిస్తారు. అలాగే ఈ ఏడాదికి (2023) గాను జిల్లేళ్ళ బాలాజీకి వచ్చే అక్టోబరు నెల 8వ తారీఖున కోయంబత్తూరు వేదికపై సన్మానించి, జ్ఞాపికతో పాటు పురస్కారంగా 50,000/-లు నగదు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా బాలాజీతో విశాలాంధ్ర సంక్షిప్త ముఖాముఖి నిర్వహించింది.

జిల్లేళ్ళ బాలాజీ

ప్రశ్న: మీరు రచనలు చేయడం ఎప్పటినుండి ప్రారంభించారు?

జవాబు: 1983 నుండి సొంతంగా కథలు రాస్తున్నాను. ఇప్పటిదాకా 150 కి పైగా కథానికలు, 120 కి పైగా కవితలూ రాశాను. కొన్ని కథలు తిరుపతి, కడప రేడియో కేంద్రాల నుండి ప్రసారమయ్యాయి.

ప్రశ్న: మీ కథలు పుస్తక రూపంలో...?

జవాబు: 1) మాట్లాడే పక్షి 2) సిక్కెంటిక 3) వొంతు 4) ఉందు నాయనా దిష్టి తీస్తా! 5) పగడాలు పారిజాతాలూ...6) నిరుడు కురిసిన వెన్నెల 7) కవన కదంబం (కవితా సంపుటి)... పేర్లతో పుస్తకాలుగా వెలువడ్డాయి.

ప్రశ్న: అనువాదం రంగంలోకి ఎలా ప్రవేశించారు?

జవాబు: తమిళ భాష కూడా తెలిసినందున, 2002 నుండి తమిళం నుండి అనువాదాలు చెయ్యటం ప్రారంభించాను. ఇప్పటివరకూ 130కి పైగా కథలు, 12 నవలలు, 2 నవలికలు, 1 కవితా సంపుటి, 1 వ్యాస సంపుటి, 1 వచన రామాయణ గ్రంథం... అనువదించాను.

ప్రశ్న: అనువాద కథల సంపుటాల గురించి...?

జవాబు: 1) కాల ప్రవాహం 2) జయకాంతన్ కథలు 3) నైలు నది సాక్షిగా... 4) శిథిలం 5) జీవనాడి 6) నీళ్లకోడి... పేర్లతో పుస్తకాలుగా వెలువడ్డాయి.

ప్రశ్న: అనువాద నవలలు కూడా వెలువడ్డాయి కదా?!

జవాబు: అవునండీ...... 1) కల్యాణి 2) ఒక మనిషి...ఒక ఇల్లు...ఒక ప్రపంచం...3) ప్యారిస్‌కు పో! 4) గంగ ఎక్కడికెళు తోంది? 5) యామం 6) సంచారం పుస్తకాలుగా వెలువడ్డాయి. అలాగే 7) మహారాజశ్రీ మంత్రిగారు(ఉజ్జ్వల మాసపత్రిక సీరియల్‌గానూ) 8) ఓ వర్షం కురిసిన రాత్రి 9) 1+1=3 (చివరి రెండు నవలలూ చతురలోనూ ప్రచురించబడ్డాయి) 10) చెల్లని డబ్బు 11) అలల సవ్వడి (ఈ రెండు నవలలూ సాహిత్య అకాడమీ ప్రచురించవలసి ఉంది) 12) వాల్మీకి ధర్మం(అముద్రితం) 1 కవితా సంపుటి, 1 వ్యాస సంపుటి ప్రచురణ కావలసి ఉంది.

ప్రశ్న: మీకు లభించిన ఇతర విశిష్ట పురస్కారాల గురించి..?

జవాబు: అనువాద నవల 'కల్యాణి'కి 2010లో ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం, 'నల్లి-దిశై ఎట్టుమ్' పత్రిక నుండి 'ఉత్తమ అనువాదకుడు' గా పురస్కారం లభించాయి.

ప్రస్తుతం అనువాదంలో నేను చేస్తున్న విశేష కృషికి గాను కోయంబత్తూర్ 'విజయ రీడర్స్ సర్కిల్' ప్రతి ఏటా ఇచ్చే 'కె.ఎస్.విరుదు' పురస్కారాన్ని అందుకోనున్నాను.

ప్రశ్న: ఎవరీ కె.ఎస్?...ఏమిటా విరుదు?

జవాబు: అభిమానులచేత కె.ఎస్‌గా పిలవబడే డా. కె.ఎస్.బాలసుబ్రమణియన్ 1937లో తిరునల్వేలిలో జన్మించారు. వీరు జయకాంతన్‌కు అత్యంత ఆత్మీయ మిత్రులు. సాహిత్యంపైన విశేషమైన అభిమానం కలవారు. 1960-75 మధ్య కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా (ఐ.ఆర్.ఎ.ఎస్.) బాధ్యతల్ని నిర్వర్తించారు. 1998లో మేనేజర్/డైరెక్టర్ గా రిటైర్ అయ్యారు. 1975-1998 మధ్య మనీలాలో ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులో ఉద్యోగం చేశారు. ఫిజిక్స్, హిస్టరీలలో పి.జి. పట్టాలు, ఫిలిప్పైన్స్ విశ్వవిద్యాలయంలో ఎం.బి.ఏ., పిహెచ్.డి పట్టాలు పొందారు.

1998లో మాతృదేశానికి తిరిగొచ్చాక సాహిత్యమూ, సామాజిక సేవా రంగాలలో విశేషమైన కృషి చేశారు. ముఖ్యంగా తమిళ సాహిత్యాన్ని ఆంగ్లంలోకి తీసుకెళ్లారు. జయకాంతన్ 5 నవలలు, 2 నవలికలు, ఒక వ్యాస సంపుటి, ఒక కథల సంపుటి, తమిళ ఆధునిక కవితా సంకలనం, ఒక ప్రముఖ తమిళ కవి మొత్తం సాహిత్యంపై విమర్శనాత్మక గ్రంథం ఇంగ్లీషులోకి తెచ్చారు. జయకాంతన్ పై 'రీడర్' నూ, అలాగే భారతరత్న సి.ఎస్.పై వ్యాసాలు రాయటమేకాక వీటికి సంపాదకత్వమూ వహించారు. తమిళ సాహిత్య, సామాజిక, అభివృద్ధిపై వీరు రచించిన మొత్తం వ్యాసాలు 4 సంపుటాలుగా వెలువడ్డాయి. ఇంకా భాష/సంస్కృతి రంగంలో కృషి చేస్తున్న 'భాష' సంస్థ నిర్వహణలోనూ, సాహిత్య అకాడమీ తమిళ విభాగంలోనూ భాగస్వామ్యం వహించారు.

వీరి మరణానంతరం వీరి అభిమానులు/అనుయాయులు 'విజయ రీడర్స్ సర్కిల్' గా ఏర్పడి 'కె.ఎస్.విరుదు' పురస్కారాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఏటా ఇద్దరు అనువాదకులకు చెరో 50,000/- రూపాయలను బహూకరిస్తున్నారు.

చలపాక ప్రకాష్, 9247475975

కొత్త పుంతలు

పెట్టుబడి
పెరిగి పెరిగి
కొత్త పుంతలు
తొక్కుతోంది!
చీపుర్లు సైతం
ఆన్లైన్లో
అమ్ముతోంది
పాపం!!!

కేశవ్ గోపాల్

అక్షరాల కొలిమిలోకి...

కాసేపు మౌనంగా ఉంటా
ఆ మౌనంలో ఆవిర్లను తవ్వుకుంటా
విడిచిన కొన్ని బాధ్యతలను
చొక్కాలకు గుండీలుగా కుట్టుకుంటా
జేబు నిండే ఉంది ఎప్పుడూ వ్యర్థాలతో
పటాపంచలు చేసే అవరోధాలను
అణచిపట్టి కాసేపు ఊపిరి సలపనీయక
ఒక చిమ్నీ వెలిగించి
లోపలి అజంతా గుహలను పరికిస్తా
కొన్ని మొక్కలకి నీళ్ళు పోసి పాదులు కట్టి
ఇంకొన్ని.. కలుపుతీత పంటకోత చేసి
మొత్తానికి ఆ మౌనంలోంచి పలుకుతా
వేల వేల అమూల్యమైన శబ్దాలను
ఏ చెవులకు అవి సోకుతాయో
ఏ వనంలో కూర్చోబెట్టి బోధనలవుతాయో
ఏ గ్రంథాల్లో నిక్షిప్తం చేయబడి
తరాల భాండాగారం అవుద్దో మరి
ఇంత మౌనంలోంచి అంత ఒలిచి
సంసారం సాగించి
వినాలనుకున్నవే విని
అనాలనుకున్నవే అని
ఇక ఆ రంగస్థలం నుంచి నిష్క్రమించి
ఆ పాత్రను వదిలి ఆ సారమంతా రంగరించి
ఒక సీసాలో నింపి ఒక కాలువలో వదిలి
నిలుచుంటాను మళ్ళీ
మౌనంతో ముచ్చటిస్తూ మౌనంగా ఒదుగుతూ
కొన్ని రెమ్మలను వేళ్ళ మధ్య ఆడిస్తూ తాకుతూ
మట్టిలోకి చూస్తూ పసిరికపై పడుకుని
ఆకాశాన్ని కావలించుకుని
ఇంకా మౌనంలోకి
వినూత్న విప్లవాత్మకమైన వెలుగుల్లోకి
అక్షరాల అరల కొలిమిలోకి..!!

- వగ్గు రఘువీర్, 9603245215

బాలల్ని అలరించే నాటికలు 'రెండు చేతులు'

సమాజంలో మార్పు తేవాలి అంటే, సామాన్య జనానికి అర్థం అయ్యే విధంగా ఏదో ఒక పద్యం, పాట, నృత్యం లేదా నాటకం ద్వారా సమాజాన్ని, సమాజంలోని ప్రజలను చైతన్యవంతం చేయవచ్చు అని చెప్పవచ్చు. ఇలా సమాజాన్ని చైతన్యపరిచిన నాటకాలు, కథలు, పాటలు, పద్యాలు ఎన్నో చూసాం, విన్నాం. అలాగే నేడు చిన్నపిల్లలకు క్రమశిక్షణ నేర్పాలంటే వారికి మంచి కథలు చెబుతున్నాం.వాటిని మంచి నాటక రూపంలో తీసుకు వచ్చిన రచయిత వల్లూరు శివప్రసాద్. ఈ నాటక రచయితగా బంగారు నంది వంటి వాటిని ఎన్నో పొందారు. వారి కలం నుండి వచ్చిన నాటిక రెండు చేతులు.

ఈ పుస్తకంలో మొత్తం 6 నాటికలున్నాయి. ఆరు నాటికలు విభిన్న అంశాలకు సంబంధించి సమాజంలో జరిగే చెడుపై ఎలా పోరాడాలి అన్న ధైర్యాన్ని పిల్లలకు కల్గించేవి ఈ నాటకాలు. ఈ నాటికలన్ని చదవదగినవే. ఇవి నాటక రూపంలో చూస్తే అద్భుతంగా ఉంటాయి. వీటిలో క్షమ అనే నాటకంలో తన కొడుక్కి తాను తెలియక చేసిన తప్పు వల్ల జీవితాంతం అంగవైకల్యం కల్గటం కొడుకు, తండ్రిని కారణం ప్రశ్నిస్తే చెప్పలేక కుంగిపోవటం జీవితాంతం బాధపడటం ఈ క్షమ నాటక సారాంశం. ఇది చదివితేనే బాధ కల్గుతుంటే, నాటక రూపంలో చూస్తే హృదయం కరుగుతుంది. మరో నాటిక స్నేహ మాధురి. ఈ నాటకంలో గూడ ఇద్దరు స్నేహితురాళ్ల స్నేహ బంధం గురించి తెలిపేది. ఇద్దరు మతాలు వేరైన బంధాలు గొప్పవని తెలిపే నాటకం. చివరిలో స్నేహితురాలికి అనారోగ్యం వల్ల జుట్టు రాలిపోవటంతో స్నేహితురాలి కోసం తాను గుండు కొట్టించుకొని బడికి వెళ్లటానికి సిద్ధం అయిన స్నేహ బంధం తెలిపే నాటకం చూడవలసిందే. మరొక నాటిక చదువు నొప్పులు నాటికలో మన ఇళ్లలో పిల్లలు గూడ స్కూలుకి వెళ్లమంటే ఎలా బడి మానేద్దామా అంటూ చెప్పే కారణాలతో సాగే నాటకం చదువు నొప్పులు. మూఢ నమ్మకాల మీద గడియారం నాటిక కూడ నేటి సమాజ పరిస్థితి అద్దం పడుతుంది. ప్రకృతికి సంబంధించి రెండు చేతులు నాటకం సాగుతుంది. ఏది ఏమైనా నాటకం, నాటకాలు మనిషిలో గొప్ప మార్పును తేగలవు. అటువంటి నాటికలు రెండు చేతులు అని చెప్పవచ్చు.

విష్ణుభొట్ల రామకృష్ణ

రెండు చేతులు (బాలల నాటికలు),
రచయిత:
వల్లూరు శివప్రసాద్,
వెల: రూ.100/-, పుటలు: 104పేజీలు,
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు,
నవచేతన బుక్‌హౌస్ బ్రాంచీల నందు లభించును.

పోషణ కోసం హంగేరికి...

అక్కడ ట్రక్కు డ్రైవర్లుగా అహ్మదాబాద్ మహిళలు

దేశంలో ఉపాధి అవకాశాలు కొరవడటంతో వలస

అహ్మదాబాద్ : దేశంలో మహిళా సాధికారత మాటలకే పరిమితమైంది. వారు విద్యలో ముందుకు వెళ్లినా... ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారింది. పిల్లలున్నా, భర్తను కోల్పోయినా, విడాకులు తీసుకున్నా బతుకుదెరువును వెతుక్కునే ప్రయత్నంలో అలుపెరగని పోరాటం చేస్తున్నారు. పాలకులు ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా మొక్కవోని ధైర్యంతో స్వచ్ఛంద సంస్థల సహకారంతో దేశ ఎల్లలు దాటేందుకు సిద్ధమవుతున్నారు. అహ్మదాబాద్‌కు చెందిన మహిళా డ్రైవర్లు హంగేరీలో ట్రక్ డ్రైవర్లుగా పని చేసేందుకు సిద్ధమవుతున్నారు. వారిలో ఒకరు రాగ్ పిక్కర్‌గా పని చేశారు. మరొకరు భర్త మరణించిన తర్వాత తనను, ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి జీవనోపాధిగా ఆ దేశంలో డ్రైవర్ వృత్తిని ఎంచుకున్నారు. వీరిలో మరొకరు విడాకులు పొందిన తల్లి కూడా ఉన్నారు. నెల రోజుల వ్యవధిలో అహ్మదాబాద్ వాసులు హంగరీకి వెళ్లి అక్కడ ట్రక్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. వారు 20-35 సంవత్సరాల వయస్సు గల ఆరుగురు మహిళల బృందం. భారతి ఒకప్పుడు తన చదువు ఖర్చు కోసం ర్యాగ్ పికర్‌గా పని చేసింది. భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలు ఉన్న రేఖ సిటీ బస్సు డ్రైవర్‌గా ఉద్యోగం రాక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. రజనీ విడాకులు తీసుకున్న తల్లి. వారి వ్యక్తిగత పోరాటాల ద్వారా గట్టిపడిన వారు. సుదూర యూరప్ దేశంలో ట్రక్కర్లుగా సవాళ్లను స్వీకరించడానికి ఎదురు చూస్తున్నట్లు ఆ ఆరుగురు మహిళలు చెప్పారు. 'పెద్ద ట్రక్కులను ఎలా నడపాలి. వాటి నిర్వహణ, ప్రాథమిక మరమ్మతులు, భాషా నైపుణ్యాలు వంటి అన్ని రకాల శిక్షణలు మాకు అందించారు. పూర్తిగా భిన్నమైన అనుభూతిని కలిగిస్తుంది. నేను ఉత్సాహంగా ఉన్నాను' అని రేఖా కహర్ అన్నారు. 'నేను ఇంటి నిర్వహణలో మా నాన్నకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. నాకు ఎటువంటి నైపుణ్యం లేకపోవడంతో నేను డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నాను. నేను ఇక్కడే అన్నీ నేర్చుకున్నాను. 12వ తరగతి వరకు నా చదువును కూడా పూర్తి చేశాను' అని మరో మహిళా డ్రైవర్ గుల్షన్ పఠాన్ అన్నారు. 'వారిలో ఎక్కువ మంది బలహీనమైన సామాజిక-ఆర్థిక నేపథ్యాల నుంచి వచ్చారు. కొంతమంది తమ భర్తల నుంచి విడిపోయారు లేదా వితంతువులయ్యారు' అని నగరానికి చెందిన స్వచ్ఛంద సంస్థ జాన్వికాస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సయానీ భట్ చెప్పారు. ఈ ఆరుగురు మహిళలు అక్టోబరు 23 నాటికి హంగేరీకి వెళ్లే అవకాశం ఉందని, రెండేళ్లపాటు అక్కడ పని చేస్తారని ఆమె తెలిపారు. ఎన్జీవో తన 'డ్రైవర్ బెన్' కార్యక్రమంలో భాగంగా 2016 నుంచి నాలుగు చక్రాల వాహనాలు నడపడానికి మహిళలకు శిక్షణ ఇస్తోంది. శిక్షణ పొందిన మహిళలు క్యాబ్ డ్రైవర్‌లు, హోటళ్లకు డ్రైవర్‌లుగా ఉద్యోగాలు పొందుతారు. అయితే భారత్‌లో అవకాశాలు లేకపోవడంతో మహిళలకు ట్రక్కు డ్రైవర్లుగా శిక్షణ ఇవ్వాలని ఇప్పటి వరకు ఆలోచించలేదు. గుజరాత్‌లోని నగర ప్రజా రవాణా వ్యవస్థ అయిన బస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్) కోసం కొంతమంది మహిళలు బస్సు డ్రైవర్‌లుగా ఉద్యోగాలు పొందారు. ట్రక్ డ్రైవింగ్ విషయానికి వస్తే, మహిళలు అద్దాల తెరను ఎదుర్కొంటున్నారు. అయితే ఆరు నెలల క్రితం ఓ అవకాశం వచ్చింది. 'బ్యాటన్, ఒక యూరోపియన్ కంపెనీ. దాని కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) ప్రాజెక్టులో భాగంగా హంగేరిలో ట్రక్కు డ్రైవర్లుగా మహిళలను నియమించాలని నిర్ణయించుకుంది. ఒక కన్సల్టెన్సీ సంస్థ ఆజాద్ ఫౌండేషన్‌ను సంప్రదించింది (దీనితో జాన్వికాస్ అనుబంధం ఉంది) ఇది దేశ వ్యాప్త చొరవను నిర్వహిస్తోంది. ఉమెన్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు జీవనోపాధి కోసం డ్రైవర్‌లుగా శిక్షణ ఇస్తుంది' అని భట్ అన్నారు. ఆజాద్ ఫౌండేషన్, వేగా గ్రూప్ ఆఫ్ కన్సల్టెన్సీ, జాన్వికాస్ సహకార కార్యక్రమం కింద మహిళలు శిక్షణ పొందారని భట్ తెలిపారు. 'మేము మొదట డాక్యుమెంటేషన్ ఆధారంగా వారు వీసా పొందేందుకు అర్హులని నిర్ధారించడానికి మహిళల జాబితాను రూపొందించాము' అని ఆమె వివరించారు. జాబితా చేయబడిన మహిళలు రెండు నెలల పాటు స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత వారు కంపెనీ నిర్వహించిన పరీక్ష ద్వారా మరింత ఎంపికై ట్రక్ డ్రైవర్‌గా తుది శిక్షణ కోసం బెంగళూరుకు పంపడం జరిగిందని భట్ తెలిపారు.

హైదరాబాద్ బాలికకు మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రతి నెల నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా హైదరాబాద్‌కు చెందిన ఆకర్షణ సతీశ్ అనే బాలికపై ప్రశంసలు కురిపించారు. ఆ బాలిక హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. పుస్తక పఠనంపై ఉన్న ఆసక్తితో ఇతరులను కూడా చదివించాలని ప్రయత్నిస్తోంది. తండ్రి డా. సతీశ్ కుమార్ ప్రోత్సాహంతో పుస్తకాలను సేకరించడం అలవాటు చేసుకుంది. అంతేకాకుండా ఆసుపత్రి అధికారుల అనుమతితో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో, అనేక ప్రాంతాల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. చిన్న వయసులోనే సమాజానికి తన వంతు కృషి చేస్తున్నందుకు ఈ కార్యక్రమం ద్వారా ఆకర్షణని ప్రధాని మోదీ అభినందించారు. "ఆకర్షణ సతీశ్ చదవడం, కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఉన్న ఆనందాన్ని హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు విస్తరిస్తోంది. ఈ బాలిక కృషికి నా అభినందనలు. ఆకర్షణను చూసి గర్విస్తున్నాను" అని మోదీ అన్నారు. చిన్నారి ప్రయత్నానికి మెచ్చి రాష్ట్రపతి నుంచి కూడా గతంలో ప్రశంసలు లభించాయి.

అదానీ ఇంటికి శరద్ పవార్

న్యూఢిల్లీ: నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ శనివారం అహ్మదాబాద్ వెళ్లి పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని కలిశారు. అదానీ సంస్థకు చెందిన ఒక ఫ్యాక్టరీని ప్రారంభించారు. అనంతరం అదానీ నివాసం, కార్యాలయాన్ని సందర్శించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను తన ట్విటర్ హ్యాండిల్‌లో పంచుకున్నారు. ఈ కొత్త కర్మాగారాన్ని ప్రారంభించడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అదానీ, పవార్ కలుసుకోవడం కొత్త కాదు. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్ నివేదిక వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రతిపక్షాలన్నీ అదానీ గ్రూప్ సంస్థలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్న తరుణంలోనూ పవార్ నివాసానికి అదానీ వెళ్లి కలిశారు. ఆ తర్వాత కొన్ని రోజులకే హిండెన్‌బర్గ్ నివేదిక ఆధారంగా అదానీపై చెలరేగుతున్న విమర్శలను పవార్ తప్పుపట్టారు. అదానీకి మద్దతుగా నిలిచారు. ఈ ఏడాది జూన్‌లో కూడా పవార్‌ను అదానీ కలిశారు.

ప్రముఖ సినీరచయిత ప్రయాగ్‌రాజ్ మృతి

ముంబై: ప్రముఖ హిందీ సినీ రచయిత ప్రయాగ్‌రాజ్ (88) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యల కారణంగా శనివారం సాయంత్రం బాంద్రాలోని తన నివాసంలో ప్రయాగ్‌రాజ్ తుది శ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు ఆదిత్య వెల్లడించారు. గత కొంత కాలంగా ఆయన గుండె జబ్బులతో బాధపడుతున్నారు. అమితాబ్ బచ్చన్ బ్లాక్ బస్టర్ హిట్స్ 'అమర్ అక్బర్ ఆంథోనీ' 'నసీబ్', 'కూలీ', 'మర్ద్', 'సుహాగ్' చిత్రాలకు కథలు అందించిన ప్రయాగ్‌రాజ్... రచయితగా 100కి పైగా చిత్రాలను తన ఖాతాలో వేసుకున్నారు. కొన్ని చిత్రాలకు గీత రచయితగా కూడా పనిచేశారు. రాజేష్ ఖన్నా నటించిన "రోటీ", ధర్మేంద్ర-జీతేంద్ర నటించిన "ధరమ్ వీర్", "అమర్ అక్బర్ ఆంథోనీ" చిత్రా స్క్రీన్‌ప్లేలకు సహకారం అందించారు. అమితాబ్ బచ్చన్, రజనీకాంత్,కమల్ హాసన్ నటించిన "గిరఫ్తార్" సినిమాకు కథ రాశారు. రచయితగా ప్రయాగ్‌రాజ్ చివరి చిత్రం దివంగత ఎస్ రామనాథన్ దర్శకత్వం వహించిన "జమానత్". అయితే ఈ చిత్రం విడుదల కాలేదు. ఆదివారం ఉదయం దాదర్‌లోని శివాజీ పార్క్ శ్మశానవాటికలో రాజ్ అంత్యక్రియలు జరిగాయి. దీనికి కుటుంబ సభ్యులు, చిత్ర పరిశ్రమకు చెందిన అనేకమంది ఆయన స్నేహితులు హాజరయ్యారు. అమితాబ్ బచ్చన్ తన వ్యక్తిగత బ్లాగ్‌లో ప్రయాగ్‌రాజ్‌కు నివాళులర్పించారు.'నిన్న సాయంత్రం మేము మా చిత్ర పరిశ్రమ యొక్క మరొక గొప్ప మూల స్తంభాన్ని కోల్పోయాము' అని పేర్కొన్నారు. రాజ్ రాసిన 'హిఫాజత్' చిత్రంలో నటించిన నటుడు అనిల్ కపూర్... చిత్ర పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి మరణం తనను బాధించిందని ట్వీట్ చేశారు. 'అమర్ అక్బర్ ఆంథోనీ' నటి షబానా అజ్మీ ప్రయాగ్‌రాజ్‌కు నివాళి అర్పించారు.

25న విచారణకు రండి

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాయ్‌పూర్ కోర్టు నోటీసు

రాయ్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): బొగ్గు లెవీ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మరో ఏడుగురు నిందితులకు రాయ్‌పూర్‌లోని ప్రత్యేక కోర్టు నోటీసులు జారీ చేసింది. నిందితులను అక్టోబర్ 25న తమ ఎదుట హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గత నెలలో 4వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అజయ్ సింగ్ రాజ్‌పుత్ కోర్టులో కాంగ్రెస్ శాసనసభ్యులు దేవేంద్ర సింగ్ యాదవ్, చంద్రదేవ్ ప్రసాద్ రాయ్, ఐఏఎస్ అధికారి రాను సాహు సహా 11 మందిని నిందితులుగా పేర్కొంటూ రెండో అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సౌరభ్ కుమార్ పాండే తెలిపారు. ఈ కేసులో సాహు, నిఖిల్ చంద్రాకర్‌ను ఇప్పటికే అరెస్టు చేసినందున ప్రత్యేక కోర్టు శనివారం రెండో అనుబంధ చార్జిషీట్‌ను నమోదు చేసి 11 మంది నిందితుల్లో తొమ్మిది మందికి నోటీసులు జారీ చేసింది. తొమ్మిది మంది నిందితుల్లో శాసనసభ్యులు యాదవ్, రాయ్‌లతో పాటు కాంగ్రెస్ నేతలు ఆర్పీ సింగ్, వినోద్ తివారీ కూడా ఉన్నారు. ఈ కేసులో మోపబడిన మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎమ్‌ఎల్‌ఏ)లోని సెక్షన్‌లు 3, 4 నాన్‌బెయిలబుల్ అయినందున, ఇంకా అరెస్టు చేయని తొమ్మిది మంది నిందితులు ముందస్తు బెయిల్ పొందవలసి ఉందని పాండే చెప్పారు. విచారణ సమయంలో వారు హాజరుకాకపోతే వారిపై కోర్టు బెయిలబుల్ లేదా నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయవచ్చని ఆయన తెలిపారు. సీనియర్ అధికారులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు , మధ్యవర్తులతో కూడిన కూటమి ద్వారా ఛత్తీస్‌గఢ్‌కు రవాణా చేయబడిన ప్రతి టన్ను బొగ్గుపై టన్నుకు రూ. 25 అక్రమ లెవీ వసూలు చేయబడిందని ఆరోపించిన కుంభకోణానికి సంబంధించినది ఈడీ విచారణ చేస్తోంది. ఈ కేసులో మొదటి చార్జిషీట్‌ను గతేడాది డిసెంబర్ 9న దాఖలు చేశారు. ఇందులో ఐఏఎస్ అధికారి సమీర్ విష్ణోయ్, వ్యాపారవేత్త సునీల్ అగర్వాల్, సూర్యకాంత్ తివారీ, అతని మామ లక్ష్మీకాంత్ తివారీలను నిందితులుగా పేర్కొన్నారు.

సందర్శకుల గ్యాలరీలో రాజకీయ నినాదాలా?

తక్షణం చర్యలు తీసుకోండి

రాజ్యసభ చైర్మన్‌కు జైరాం రమేశ్ లేఖ

న్యూఢిల్లీ: రాజ్యసభలోని సందర్శకుల గ్యాలరీలో కూర్చున్న కొందరు వ్యక్తులు రాజకీయ నినాదాలు చేసిన ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఆదివారం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌కు లేఖ రాశారు. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్‌గా ఉన్న రమేశ్... సెప్టెంబరు 21 న ఎగువ సభలో జరిగిన షాకింగ్ సంఘటన గురించి తీవ్రమైన ఆందోళన, నిరాశ వ్యక్తపర్చారు. సందర్శకుల గ్యాలరీలో కూర్చున్న కొంతమంది వ్యక్తులు నినాదాలు చేయడం, సభ ఆవరణలో హడావిడి సృష్టించడం వినిపించిందని రమేష్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ సంఘటన గందరగోళానికి దారితీయడమే కాకుండా సభలో నియమ నిబంధనల అమలుపై అనేక ప్రశ్నలు లేవనెత్తిందని తెలిపారు. రాజ్యసభలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, మార్షల్స్ నిఘా ఉన్నప్పటికీ... ఒక సమూహం రాజకీయ నినాదాలు ఎలా చేయగలిగిందని ప్రశ్నించారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా సందర్శకుల గ్యాలరీలో వ్యక్తుల ప్రవర్తనను స్పష్టంగా వివరించే రూల్ 264ని ఉల్లంఘిస్తూ ఈ సంఘటన జరిగిందని రమేశ్ లేఖలో స్పష్టం చేశారు. 50 మందికి పైగా సందర్శకులు నినాదాలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని రమేశ్ ధన్కర్‌కు తన లేఖలో వివరించారు. దీనిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ ఘనతలతో భారతీయుల ఆనందం రెట్టింపు: మోదీ

న్యూఢిల్లీ: చంద్రయాన్-3 విజయం తర్వాత జీ20 సదస్సును విజయవంతంగా నిర్వహించడంతో భారతీయుల ఆనందం రెట్టింపైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ఆదివారం (24-9-2023) ఆల్ ఇండియా రేడియో కార్యక్రమం మన్ కీ బాత్ 105వ ఎపిసోడ్‌లో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జీ20 సదస్సు విజయవంతంగా నిర్వహించడం, చంద్రయాన్-3 విజయంపై మోదీ మాట్లాడారు. దేశ ప్రజలు, యువత, ఢిల్లీలో జీ20 సదస్సు కోసం ఎంతో కృషి చేశారని మోదీ ప్రశంసించారు. చంద్రయాన్ 3 విజయం తర్వాత జీ20 సదస్సును నిర్వహించడం వల్ల భారతీయుల ఆనందం రెట్టింపైందన్న మోదీ... జీ20 సదస్సులోకి ఆఫ్రికా యూనియన్‌ని ఆహ్వానించడం ద్వారా ప్రపంచానికి భారత్... తన నాయకత్వ ప్రతిభను చాటుకుందన్నారు. ఈ సదస్సు సందర్భంగా నాలుగు ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనమిక్ కారిడార్ ప్రతిపాదన కూడా ప్రపంచ వాణిజ్యంలో కీలక పాత్ర పోషిస్తుందని మోదీ అన్నారు. తనకు ఎక్కువగా చంద్రయాన్-3, జీ20 విజయంపైనే లేఖలు వచ్చాయని మోదీ పేర్కొన్నారు. చంద్రయాన్-3 ల్యాండింగ్ లైవ్‌ని యూట్యూబ్ ఛానెల్‌లో 80 లక్షల మందికి పైగా చూశారన్న మోదీ... చంద్రయాన్-3 మహా క్విజ్‌లో అందరూ పాల్గొనాలని దేశ ప్రజలను కోరారు. సెప్టెంబర్ 26న జరిగే జీ20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానన్న మోదీ... కళాశాల విద్యార్థులంతా ఇందులో పాల్గొనాలని కోరారు. ఐఐటీ, నిట్స్, మెడికల్ కాలేజీలకు చెందిన విద్యార్థులు కూడా ఇందులో పాల్గొంటున్నారని మోదీ వివరించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం వస్తోందన్న మోదీ... కొన్నేళ్లుగా భారత్‌పై ప్రపంచ దేశాలకు ఆసక్తి పెరుగుతోందన్నారు. భారత పర్యాటక రంగం క్రమంగా తన పరిధిని పెంచుకుంటోందన్నారు. జీ20 సదస్సు సందర్భంగా లక్ష మందికి పైగా విదేశాల ప్రతినిధులు భారత్‌కు వచ్చి... ఇక్కడి సంస్కృతులు, ఆచారాలు, వంటలు, వారసత్వ సంపద గురించి తెలుసుకున్నారని మోదీ వివరించారు. ఇటీవల రవీంద్రనాథ్ ఠాగూర్ శాంతినికేతన్, కర్నాటకలోని హోసాల ఆలయాలను ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించడం గర్వంగా ఉందని మోదీ అన్నారు. ఇప్పుడు ఇండియాలో ప్రపంచ వారసత్వ సంపదల సంఖ్య 42కి చేరిందన్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లాలో యువత... పిల్లల కోసం ప్రత్యేకమైన ఘోడా లైబ్రరీ (గుర్రంపై పుస్తకాలు ఉండే లైబ్రరీ)ని ప్రారంభించడాన్ని మెచ్చుకున్నారు. దాదాపు 12 గ్రామాల్లో పిల్లలకు ఈ లైబ్రరీ అందుబాటులోకి తెచ్చారని వివరించారు. పిల్లలంతా పుస్తకాలు చదవాలని ప్రధాని కోరారు. పండుగ సీజన్‌లో బహుమతులు ఇచ్చేందుకు భారత్‌లో తయారైన గిఫ్టులను కొనాలని మోదీ దేశ ప్రజలను మన్ కీ బాత్‌లో కోరారు. వోకల్ ఫర్ లోకల్ మంత్రాన్ని మర్చిపోవద్దని సూచించారు.

రాజకీయ ప్రత్యర్థులే లక్ష్యంగా సోషల్ మీడియా దుర్వినియోగం

కేరళ సీఎం విజయన్



తిరువనంతపురం: రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. త్రికరిపూర్‌లో పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన పై విధంగా అన్నారు. తిరువనంతపురంలోని పరశాలకు చెందిన 26 ఏళ్ల కాంగ్రెస్ కార్యకర్త అబిన్ కోడంకర సోషల్ మీడియా వేదికగా సీపీఎంకి చెందిన సీనియర్ నేతల కుటుంబంలోని మహిళలపై వేధింపులకు పాల్పడ్డాడు. అభ్యంతరకర ఫొటోలను షేర్ చేసి వారిని అవమానించే రీతిలో వ్యాఖ్యలు పోస్టు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు అబిన్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

"రాజకీయ ప్రత్యర్థులే లక్ష్యంగా కొందరు (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తు) ప్రవర్తిస్తున్నారు. ముఖ్యంగా మహిళలను వేధింపులకు గురిచేస్తూ ఆ పార్టీ సోషల్‌మీడియాను దుర్వినియోగం చేస్తోంది. వారిని ఇబ్బందులను గురిచేసేందుకు ప్రత్యేక ఏజెన్సీలను రాష్ట్రానికి తీసుకు వచ్చింది. వీటికి రూ. లక్షలు వెచ్చిస్తోంది. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కకపోవడంతో ఈ దుశ్చర్యకు పాల్పడుతోంది. ఈ సారి ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. అందుకే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారాన్ని షేర్ చేస్తున్నారు. అధికార పార్టీ నేతల వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది" అని విజయన్ విమర్శించారు. ఇటువంటి చర్యలను సహించవద్దని తమ పార్టీ కార్యకర్తలకు సూచించారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలని కోరారు. ప్రస్తుతం సోషల్ మీడియాను ఎక్కువగా వినియోగిస్తున్నారని.. అయితే, దీనిని ఉపయోగించేటప్పుడు మన నాగరికతను కోల్పోకూడదని సీఎం అన్నారు. ఎవరినీ వ్యక్తిగతంగా కించపరిచేలా మన చర్యలు ఉండకూడదని విజయన్ సూచించారు.

రాజుకు ఆస్థాన కవిగా బెంగాల్ గవర్నర్: బసు

కోల్‌కతా: రాజుకు ఉండే ఆస్థాన కవిగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ ఉన్నారని ఆ రాష్ట్ర విద్యామంత్రి బ్రత్యబసు విమర్శించారు. 'ఓ కవికి ప్రజలతో సంబంధాలు ఉంటాయి కానీ ఇక్కడ ఉన్నది మాత్రం రాజుకు ఆస్థాన కవి. ప్రస్తుత కాలంలో అనుచితమైన పదవిని కాపాడుకునే ప్రయత్నం జరుగుతోంది. దీనిపై ఆలోచన చేయాలి' అని అన్నారు. గవర్నర్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఈనెల 9న రాసిన లేఖ ఇద్దరి మధ్య గోప్యంగా ఉంటుందన్నారు. ఇద్దరిలో ఎవరైనా లేఖల గురించి మాట్లాడేందుకు ఇది సరైన సమయం కాదని చెప్పారు. మిస్టరీగా ఉన్నది హిస్టరీగా మారిందన్నారు. గవర్నర్ వ్యాఖ్యలపై బసు ఆదివారం స్పందించారు. తృణమూల్ కాంగ్రెస్ టీచర్స్ సెల్ సభ్యులతో మాట్లాడుతూ బోస్‌ను రాజ్‌భవన్ కవిగా వర్ణించారు. వైస్ ఛాన్సలర్ల నియామకాన్ని ప్రస్తావిస్తూ గతంలో వీరి కోసం మనం పోరాటం చేయగా కొందరు వీసీలు ఇప్పుడు గవర్నర్‌తో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారని బసు అన్నారు. 'మనం వారిని ఏమీ అనవద్దు. కానీ ఉండాల్సింది మాత్రం రాష్ట్రంలోనే అని వారు (వీసీలనుద్దేశించి) గుర్తుపెట్టుకోవాలి. ఈ గవర్నర్ పదవి ఎంతో కాలం ఉండదని గ్రహించాలి' అని వ్యాఖ్యానించారు. ప్రతి వ్యవస్థ, పదవిని తమ నియంత్రణలో పెట్టుకునేందుకు కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. 16 రాష్ట్ర యూనివర్సిటీలకు తాత్కాలిక వీసీలను నియమించే క్రమంలో మే నుంచి గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఘర్షణ కొనసాగుతోంది. ఈ నియామకాలు ఏకపక్షంగా జరిగాయని, ఉన్నత విద్యశాఖ, సీఎం లేక మంత్రితో చర్చలు, సంప్రదింపులు జరుపలేదని బెంగాల్ ప్రభుత్వం ఆరోపించింది.

జమ్ముకశ్మీర్‌లో కాంగ్రెస్‌కు ఆదరణ: పీసీసీ రసూల్

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని 90 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీకి పట్టు ఉందని కాంగ్రెస్ ప్రకటించింది. నేషనల్ కాన్ఫరెన్స్, బీజేపీ, పీడీపీ వంటి పార్టీల ప్రభావం పరిమితమేనని, 90 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఆదరణ ఉందని పేర్కొంది. జమ్ముకశ్మీర్‌లో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించగలదని ఆదివారం విలేకరులతో మాట్లాడిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వికార్ రసూల్ తెలిపారు. తమ పార్టీకి వచ్చిన అనేక మంది నేతలను కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. సంవత్సర కాలంలో మిగతా పార్టీల నుంచి అనేక మంది కాంగ్రెస్‌లోకి వచ్చారని చెప్పారు. జమ్ములో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు 80శాతం మంది కాంగ్రెస్ గూటికి చేరగా ఆప్ కార్యాలయాన్ని మూసివేశారన్నారు. 80శాతం మంది డీపీఏపీ వర్కర్లు కాంగ్రెస్‌లో చేరారని రసూల్ వెల్లడించారు. మీర్వాయిజ్, వీరి, దావూదీ వంటివారిని అరెస్టు చేయడం సరైనది కాదని, వారి విడుదలను స్వాగతిస్తున్నానని చెప్పారు. ఏ మతానికి చెందిన మతపరమైన నేతలను జైళ్లకు పంపరాదని రసూల్ తెలిపారు.

ఉగ్రవాదులపై ఉక్కుపాదం

19మంది ఆస్తుల జప్తుకు ఎన్ఐఏ సిద్ధం

న్యూఢిల్లీ: కెనడాలోని భారత వ్యతిరేక శక్తులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల భారతీయులను బెదిరించిన సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) నాయకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూకు పంజాబ్‌లో ఉన్న ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) జప్తు చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో ముందడుగు వేసిన ఎన్ఐఏ వివిధ దేశాల్లో నివసిస్తున్న మరో 19 మంది ఖలిస్థానీ ఉగ్రవాదుల ఆస్తుల జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే వీరి ఆస్తులను జప్తు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వివిధ దేశాల్లో ఉంటూ భారత్‌లో వేర్పాటువాదంపై ఖలిస్థాన్ సానుభూతిపరులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారు. బ్రిటన్, అమెరికా, కెనడా, దుబాయ్, పాకిస్తాన్‌తోపాటు ఇతర దేశాల్లో ఉంటున్న వీరిని భారత్ ఇప్పటికే ఉగ్రవాదులుగా ప్రకటించింది. విదేశీ గడ్డపై ఉంటూ భారత్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న వీరి హవాలా కార్యకలాపాలు, స్థానికంగా ఆస్తులపై ఎన్ఐఏ దృష్టి సారించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం కింద వీరందరిపై చర్యలకు సిద్ధమైన ఎన్ఐఏ దాదాపు 20 మంది ఆస్తులను జప్తు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇలా ఖలిస్థాన్ వేర్పాటువాదంతోపాటు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న 43 మంది మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ జాబితాను ఎన్ఐఏ ఇటీవలే విడుదల చేసింది. వీరికి సంబంధించిన ఆస్తుల వివరాలు తెలపాలని ప్రజలకు సూచించింది. వీరి ఫొటోలను కూడా విడుదల చేసింది. ఈ లిస్టులో ఉన్న ఖలిస్థాని సానుభూతిపరులు ఎక్కువగా కెనడాలోనే నివసిస్తున్నట్లు ఎన్ఐఏ అంచనా వేస్తోంది. కెనడాలోని భారతీయులను ఇటీవల బెదిరించిన నిషేధిత ఎస్ఎఫ్‌జే నేత గురుపత్వంత్ సింగ్ పన్నూకు పంజాబ్‌లో ఉన్న ఆస్తులను జాతీయ దర్యాప్తు సంస్థ జప్తు చేసింది. అమృత్‌సర్ శివారులోని పన్నూ పూర్వీకుల గ్రామమైన ఖాన్‌కోట్‌లో పన్నూకు ఉన్న 5.7 ఎకరాల భూమిని, చండీగఢ్‌లోని నివాసాన్ని స్వాధీనం చేసుకుంది. కెనడాలో నివసిస్తున్న పన్నూపై పంజాబ్, ఇతరప్రాంతాల్లో 12 కేసులు ఉన్నాయి.

వందే భారత్ కోచ్‌లలో కొత్త మెరుగులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందే భారత్ రైళ్ల సర్వీసులను క్రమంగా విస్తరిస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 వందే భారత్ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండగా, కొత్తగా మరో తొమ్మిది రైళ్లను ప్రధాని మోదీ వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. దీంతో మొత్తం వందే భారత్ రైళ్ల సంఖ్య 34కి చేరింది. కొత్తగా తీసుకొచ్చిన వాటిలో ఒక రైలు కాషాయ రంగులో (కాసరగోడ్-తిరువనంతపురం రూట్‌లో ఒకటి), మిగిలిన రైళ్లు నీలం రంగులో నడుపుతున్నారు. రాబోయే రెండు నెలల్లో మరో 9 కాషాయ రంగు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలోనే కొత్తగా ప్రారంభించిన 9 రైళ్లలో కొన్ని ఫీచర్లను గతంలో కంటే మరింత మెరుగుపరిచినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన సలహాలు, సూచనల మేరకు ఈ మార్పులు చేసినట్లు వెల్లడించారు.

కొత్తగా ప్రారంభించిన వందే భారత్ కోచ్‌లలో సీటు రిక్లైనింగ్ యాంగిల్‌ను 17.31 డిగ్రీల నుంచి 19.37 డిగ్రీలను పెంచారు. దానివల్ల ప్రయాణికులు తమ సీట్లను మరింత వెనక్కి జరిపి సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. ప్రయాణికులు కూర్చునే సీట్ల కుషన్ గట్టిగా ఉందనే విమర్శల నేపథ్యంలో కొత్త కోచ్‌లలో మెత్తటి కుషన్‌లను ఏర్పాటు చేశారు. దాంతోపాటు, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ సీట్ల రంగును ఎరుపు నుంచి నీలంకు మార్చడంతోపాటు, ఫుట్‌రెస్ట్‌ను మరింత పొడిగించారు. కొత్తగా సీట్ల వెనుక మ్యాగజైన్ బ్యాగ్‌లను ఏర్పాటు చేశారు. మొబైల్ ఛార్జింగ్ కోసం సీట్ల కింద ఏర్పాటు చేసిన ఛార్జింగ్ పాయింట్లను సులువుగా యాక్సెస్ చేసేలా వాటిలో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. మరుగుదొడ్లలో మెరుగైన లైటింగ్ కోసం 1.5 వాట్ బల్బుల స్థానంలో 2.5 వాట్ బల్బులను అమర్చారు. వాష్ బేషిన్‌లో చేతుల కడిగే సమయంలో నీళ్లు బేసిన్ నుంచి బయటికి రాకుండా వాటి సైజ్‌ను పెంచారు. ప్రయాణికులకు సౌకర్య వంతంగా ఉండేలా వాటర్ ట్యాప్‌లు, టాయిలెట్ హ్యాండిల్స్‌ను కొత్తగా డిజైన్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దివ్యాంగుల వీల్‌ఛైర్‌లను భద్రపరిచేందుకు ప్రత్యేక పాయింట్‌లను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు మెరుగైన ఎయిర్ కండిషనింగ్ కోసం ఎయిర్‌టైట్ ప్యానల్స్‌లో మార్పులు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. దాంతోపాటు లగేజ్ ర్యాక్ లైట్లకు గతంలో కంటే మరింత మృదువైన టచ్ కంట్రోళ్లను ఏర్పాటు చేశారు. కోచ్‌లో అగ్ని ప్రమాదాలను గుర్తించే ఏరోసోల్ ఫైర్ డిటెక్షన్ వ్యవస్థను మరింత మెరుగుపరిచినట్లు అధికారులు తెలిపారు.

ప్రజాచైతన్యంతోనే ప్రజాస్వామ్యం మనుగడ

- సిహెచ్.దివాకర్‌బాబు
- శతజయంతి సందర్భంగా కపర్దికి ఘనంగా నివాళులు

విశాలాంధ్ర–విజయవాడ: ప్రజలు విద్యావంతులైన, సామాజిక అవగాహనతో చైతన్యవంతమైతేనే ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యం అవుతుందని సిద్ధార్థ లా కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.దివాకర్ బాబు అన్నారు. కమ్యూనిస్టు నేత మందలపర్తి వెంకట నారాయణ కపర్ది శత జయంతి సభ మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు అధ్యక్షతన సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 'ప్రజాస్వామ్యం మనుగడ' అనే అంశంపై దివాకర్ బాబు స్మారకోపన్యాసం చేశారు. మనదేశంలో పౌర, రాజకీయ హక్కులను ప్రాథమిక హక్కులుగా నిర్ణయించారని వాటికి భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని చెప్పారు. ఆర్థిక హక్కుని ఆదేశిక సూత్రాల్లో చేర్చటం జరిగిందన్నారు. సరళీకరణ, నూతన ఆర్థిక విధానాలు ప్రపంచ వ్యాప్తంగా అమలులోకి వచ్చిన తరువాత చట్టాల్లో మార్పు వచ్చిందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సంస్థలు స్వతంత్రంగా పని చేయాల్సి ఉన్నా నేడు అలా జరగటం లేదన్నారు. సీబీఐ, ఈడీ, ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించటం లేదన్నారు. ప్రధాన మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, చీఫ్ జస్టిస్ నిర్ణయం మేరకు ఎలక్షన్ కమిషన్‌ను నియమించాల్సి ఉందన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసే కేసుల్లో 90శాతం ప్రతిపక్ష నాయకులు, సామాజిక ఉద్యమకారులపైనే ఉంటున్నాయన్నారు. బీమాకోరేగావ్ కేసు ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. ప్రసార మాధ్యమాలు 90శాతం బీజేపీ చేతిలో ఉన్నాయన్నారు. దర్యాప్తు ఏజన్సీలు ప్రభుత్వం చేతిలో ఉంటున్నాయని చెప్పారు. దేశంలో నేర చరిత్ర ఉన్న 45శాతం మంది చట్ట సభల్లో ఉన్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. రాజ్యాంగం నిర్దేశించినట్లు సహకార ఫెడరల్ వ్యవస్థను కేంద్రం దెబ్బతీస్తుందన్నారు. ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలను కేంద్రం ఆధీనంలోకి తీసుకుంటుందన్నారు. సామాజిక న్యాయం సనాతన ధర్మానికి పూర్తి విరుద్ధం అన్నారు. సెక్యూలర్ వ్యవస్థను అమలు చేయటం లేదన్నారు. బహుళత్వాన్ని దెబ్బతీసేలా నిర్ణయాలు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయమూర్తి ఇచ్చే తీర్పుల్లో వారు పెరిగిన వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉంటుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సాధికారత పరిపాలన ఉండాలంటే ప్రజల ఆలోచనల్లో మార్పు రావాలన్నారు.

పాలకుల దయాదాక్షిణ్యాలపై ప్రజాస్వామ్యం: రామకృష్ణ

దేశంలో ప్రజాస్వామ్యం పాలకుల దయాదాక్షిణ్యాలపై నడుస్తున్నదని ప్రజాస్వామ్య రక్షణకు ప్రజాఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కేంద్ర క్యాబినేట్‌లో ఒక్క ముస్లిం లేదని, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర శాసన సభలో ఒక్క ముస్లిం ఎమ్మెల్యే లేదని చెప్పారు. 1950 జనవరి 26వ తేదిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ఈ రాజ్యాంగం తమకు సమ్మతం కాదనీ, మనువాదం ఆధారంగా రాజ్యాంగం ఉండాలని తన అధికార పత్రికల్లో పేర్కొందని గుర్తు చేశారు.

కేంద్రంలో బీజేపీ మూడవ సారి అధికారంలోకి వస్తే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెడతారని చెప్పారు. ప్రధాని, కొంతమంది ముఖ్యమంత్రులు ప్రెస్ కాన్ఫరెన్సులు పెట్టకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిన నేపథ్యంలో రానున్న రోజుల్లో డబ్బులేని వ్యక్తివి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నావ్ అని ఓటర్లు ప్రశ్నించే పరిస్థితి వస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యానికి కాపాడుకోవటం కోసం కమ్యూనిస్టుల పునరేకీరణ అత్యంత ఆవశ్యకం అన్నారు. కమ్యూనిస్టులు, లౌకిక వాదులు ప్రజాఉద్యమంలో భాగస్వామ్యులు అయి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సి ఉందన్నారు.

సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ కపర్ది తన రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించే వారని చెప్పారు. స్నేహశీలి అని, మంచి మార్గనిర్దేశకులన్నారు. కపర్దితో తనకు ఉన్న అనుబంధాన్ని, ఆనాటి సంఘటనలను వివరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ, ఏఐటీయూసీ నాయకులు పీజే చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు టీవీ రమణమూర్తి, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కపర్ది కుటుంబ సభ్యులు జగన్మోహనరావు, అమ్మాజి, రామారావు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముందుగా కపర్ది చిత్రపటానికి ఆంజనేయులుతో పాటు సీపీఐ నాయకులు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్ర నాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, విజయవాడ నగర అధ్యక్షులు ఎస్‌కే.నజీర్ అమర వీరులను స్మరిస్తూ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతివ్వొద్దు

రాజాకు మాలమహానాడు వినతి

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ) వర్గీకరణకు మద్దతు ఇవ్వవద్దని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజాకు మలామహానాడు అధ్యక్షులు జి.చెన్నయ్య కోరారు. మహానాడు జాతీయ నేతలతో పాటు రాజాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఎస్సీ వర్గీకరణ చేయాలని చూస్తున్నారని మహానాడు ప్రతినిధులు తెలిపారు. ఇటువంటి నిర్ణయాలకు మద్దతివ్వవద్దని రాజాకు విన్నవిం చారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ ఉషామెహ్రా కమిషన్ పేర్కొన్నట్టు తెలంగాణలో మాల, మాదిగల్లో ఎవరు అభివృద్ధి చెందారో శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు జ్యుడిషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. దళిత జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 20శాతానికి పెంచాలన్నారు. కాలం చెల్లిన వర్గీకరణ డిమాండ్‌ను పక్కన పెట్టి అండేద్కర్ కలలుకన్న రాజ్యాధికారం కోసం కలిసి పోరాడాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి వారిని రాజ్యాధికారం లక్ష్యానికి దూరం చేస్తున్నారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ అన్నారు. ఉభయ రాష్ట్రాల్లో ఎస్సీలపై హంస జరుగుతోందని, ఇప్పటివరకు వర్గీకరణ ఎందుకు జరగలేదన్న కోణంలో ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయనన్నారు.

పదవీ విరమణ తర్వాత విశాఖలోనే ఉంటా

హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్

విశాలాంధ్ర–విశాఖకలెక్టరేట్: విశాఖలోని నూతన కోర్టుల సముదాయాన్ని ఆదివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు. వీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ మానవేంద్ర రాయ్ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విశాఖ జిల్లా న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్య దర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చీఫ్‌జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ... విశాఖ సుందర నగరమని, పదవీ విరమణ చేశాక విశాఖ లోనే ఉంటూ ప్రాక్టీస్ చేయాలని ఉందన్నారు. విశాఖ బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఇవ్వాలని కోరారు. ప్రముఖ నేతలు, సీనియర్ న్యాయవాదులు విశాఖ నుంచి దేశానికి సేవలు అందించార న్నారు. న్యాయ మూర్తులు కోర్టు భవనాలను సందర్శించారు. నూతన కోర్టు సముదాయాన్ని ఒక పార్కింగ్ ఫ్లోర్, మూడు అంతస్తులతో సువిశాల గదులతో ఆహ్లాదకరంగా ఉండే విధంగా నిర్మించారు. నూతన న్యాయ స్థానాల సముదాయంలో న్యాయవాదులకు కాన్ఫరెన్స్ హాలు, తాగునీటి సౌకర్యం, కక్షిదారులకు మెరుగైన సదుపాయాలు, అడ్వకేట్ కమిషన్ కోసం పత్యేక రూము, మీడియేషన్ రూము, మహిళా, పురుష న్యాయవాదులకు విశాలమైన విశ్రాంతి సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ భవన సము దాయంలోకి ఎనిమిది జిల్లా కోర్టులు, రెండు ఫ్యామిలీ న్యాయస్థానాలు మారనున్నాయి. ఏడేళ్ల క్రితం భవన నిర్మాణానికి శంకుస్థాపన జరిగిందని, ఎట్టకేలకు నూతన కోర్టు భవన సముదాయం ప్రారంభోత్సవానికి నోచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉందని విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, శ్రీని వాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు బైపా అరుణ్ కుమార్, నరసింగ రావు, రామ జోగేశ్వరరావు, అధిక సంఖ్యలో న్యాయ వాదులు పాల్గొన్నారు.

తెలంగాణ సహా 4 రాష్ట్రాల్లో విజయం మాదే

- ప్రజల దృష్టి మళ్లించేందుకే దానిష్‌పై బిధూఢీ వ్యాఖ్యలు
- ఇదంతా బీజేపీ వ్యూహాల్లో భాగం: మహిళా బిల్లు తక్షణ అమలునే కాంగ్రెస్ కోరేది
- ప్రతిదిన్ మీడియా నెట్వర్ సదస్సులో రాహుల్

న్యూఢిల్లీ: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే నాలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేస్తుందని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దీమా వ్యక్తంచేశారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలుపు తథ్యమన్నారు. తెలంగాణలో గెలుపు అవకాశాలు మెండుగా ఉన్నాయని, రాజస్తాన్‌లో రసవత్తర పోరు ఉంటుంది గానీ మేమే గెలుస్తామని ఆయనన్నారు. లోక్‌సభలో బీఎస్పీ నేత దానిష్ అలీని బీజేపీ ఎంపీ రమేశ్ బిధూఢీని దుర్భాషలాడటాన్ని ప్రస్తావించారు. కుల గణన డిమాండ్ నుంచి దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుయుక్తులను బీజేపీ ప్రదర్శిస్తుందని విమర్శించారు. వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు వన్ నేషన్, వన్ ఎలక్షన్ అనే సరికొత్త డ్రామాకి బీజేపీ తెరతీసిందని ఆరోపించారు. బీజేపీ అనుసరించే దృష్టి మళ్లింపు వ్యూహాల్లో ఇది ఒకటని, తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు బీజేపీ తరచూ ఇలాంటి జిమ్మిక్కులు చేస్తుందన్నారు. ప్రతిదిన్ మీడియా నెట్వర్క్ ఆఫ్ అసోం అధ్వర్యంలో ఆదివారం జరిగిన సదస్సులో రాహుల్ అన్నారు. కర్నాటక శాసనసభ ఎన్నికల నుంచి పాఠాలు నేర్చుకున్నామని చెప్పారు. ప్రతిపక్షాల వాదనలు వినబడకుండా కేంద్రం తప్పు దోవ పట్టిస్తోందని రాహుల్ విమర్శించారు. కర్నాటకలో తమ వాణి కచ్చితంగా ప్రజలకు చేరేలా చెశామని, తెలంగాణలోనూ అదే జరుగుతోందని అన్నారు. ప్రతి పక్షాలు కలిసికట్టుగా పనిచేస్తున్నాయని, 2024లో బీజేపీకి షాక్ తప్పబోదని తెలిపారు. దేశ సంపదలో అసమానతలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయని, ఇండియా పేరు మార్పు వంటివన్నీ వాస్తవ సమస్యల నుంచి దృష్టి మరల్చే చర్యల్లో భాగమేనని రాహుల్ అన్నారు. తమ సొంత బలాన్ని నిర్మించు కోకుండా దృష్టి మరల్చడం ద్వారా ఎన్నికల్లో బీజేపీ గెలుస్తోం దని రాహుల్ ఎద్దేవా చేశారు. కర్నాటకలో బీజేపీ కట్టుకథలకు అవకాశం ఇవ్వని విధంగా ఎన్నికల్లో పోరాడామని చెప్పారు. రాజస్తాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా కాంగ్రెస్‌కు ఉన్న గెలుపు అవకాశాలపై ప్రశ్నకు రాహుల్ స్పందిస్తూ 'ఇప్పుడున్న పరిస్థితులను బట్టి తెలంగాణలో గెలవచ్చు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో తప్పక గెలుస్తాం. రాజస్తాన్‌లోనూ విజయసంకేతాలు ఉన్నాయి. మేమే కాదు బీజేపీ కూడా అంతర్గతంగా ఇదే చెబుతోంది' అని అన్నారు. బిధూఢీ తర్వాత నిషికాంత్ దూబే కూడా దూషణలపర్వానికి తెరతీశారని, ఇదంతా కులగణనపై నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీ చేస్తోంద న్నారు. ప్రజలు కుల గణనను కోరుకుంటున్నారని తెలిసినా దానిపై చర్చిందుకు వారు ఇష్టపడటం లేదని, ఈ అంశాన్ని ఎప్పుడు ప్రస్తావించినా ఇలాంటివే చేస్తారని బీజేపీని రాహుల్ దుయ్యబట్టారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ లేదన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లో తమ పార్టీకి మంచి పట్టు ఉందని చెప్పారు. రాజస్తాన్ ప్రజలను ప్రస్తుత పాలన గురించి ప్రశ్నిస్తే తమకు నచ్చిందనే సమాధానం వస్తుందని నమ్మకంగా చెప్పారు. మీడియాను బీజేపీ శాశించే పరిస్థితుల్లో ఉన్నాం. దీనికి విప క్షం అలవాటు పడుతోందని, కలిసి ముందుకెళుతోందన్నారు. భారత్ జనభాలో 60శాతానికి ఇండియా కూటమి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విస్తుపోవడం ఖాయమని రాహుల్ తెలిపారు. మహిళా రిజ ర్వేషన్ బిల్లును కావలంటే రేపు ఉదయమే అమలు చేయొచ్చు, లోక్‌సభ, విధానసభల్లో మహిళలకు 33శాతం సీట్లు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటన చేస్తే సరిపోతుందని ఆయనన్నారు. మహిళా బిల్లుకు జనగణన– పునర్విభజనతో సంబంధం లేదని చెప్పారు. అదానీ వ్యవహారంలో ఫైనాన్షియల్ టైమ్స్ వంటి వార్తాపత్రికల్లో వచ్చే నివేదికల నుంచి దృష్టి మళ్లించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం నిర్వహించిందని అన్నారు. తొలుత ఇండియా పేరును భారత్‌గా మార్చాలను కుంది కానీ వ్యతిరేక రావడంతో అది కుదరలేదు కాబట్టి మహిళా బిల్లును తెరపైకి తెచ్చిందని రాహుల్ తెలిపారు. పదేళ్ల తర్వాత ఈ బిల్లు ప్రయోజనం ఇస్తుందని బీజేపీ చెబుతుంటే ఇప్పుడే అమలు చేయాలని కాంగ్రెస్ అంటోందన్నారు. తన లఢక్ పర్యటన, భారత్ జోడో యాత్ర విశేషాలనూ, తన అనుభవాలనూ రాహుల్ గాంధీ పంచుకున్నారు.

ఏఐటీయూసీ పోరాటనిధికి ఏపీ రాష్ట్ర సమితి రూ. లక్ష విరాళం

తిరుప్పూర్: ఏఐటీయూసీ జాతీయ కేంద్రం నిర్వహణకు, కేంద్ర కార్యాలయ భవనం నిర్వహణకు పోరాటనిధి సమీకరించాలని తమిళనాడులోని తిరుప్పూర్‌లో మూడు రోజులపాటు జరిగిన జనరల్ కౌన్సిల్ నిర్ణయించింది. ఆ మేరకు ప్రధానకార్యదర్శి ఇచ్చిన పిలుపునకు స్పందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసమితి లక్షరూపాయల చెక్కును వేదికపై అమర్ జీత్ కౌర్‌కు అందచేసింది. చెక్కును అందచేసిన వారిలో ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకట సుబ్బయ్య, కోశాధికారి బీవీవీ కొండలరావు, ఉపాధ్యక్షుడు పి.దామోదర రావు, ప్రవంతి ఉన్నారు.

అవకాశం దొరికిన ప్రతిసారీ వేధింపులే

బ్రిజ్‌భూషణ్ భాగోతంపై ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ అవకాశం దొరికిన ప్రతిసారి మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురి చేశాడని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను సేకరించినట్లు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టుకు తెలిపారు. మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ బ్రిజ్ భూషణ్‌కు క్లీన్‌చీట్ ఇవ్వలేదనే విషయాన్ని కోర్టులో ప్రస్తావించారు. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు కోర్టుకు నివేదికను సమర్పించారు. ఆసియా క్రీడల్లో పాల్గొనేందుకు తజకిస్థాన్ వెళ్లిన మహిళా రెజ్లర్లలో ఒకరిని బ్రిజ్ భూషణ్ తన గదికి పిలిచి గట్టిగా కౌగలించుకున్నాడని, ఆమె ప్రతిఘటించడంతో ఒక తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తిగా అలా చేసినట్లు తన చర్యను బ్రిజ్ భూషణ్ సమర్థించుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. తన చర్యలపై ఆయనకి పూర్తి అవగాహన ఉందనడాన్ని ఈ ఘటన స్పష్టంగా తెలుపు తోందని పోలీసులు తెలిపారు. బాధితురాలు స్పందించిందా లేదా అన్నది ప్రశ్న కాదని, ఆమెకు అన్యాయం జరిగిందన్నారు. అదే సమయంలో అనుమతి లేకుండా తన చొక్కాను పైకెత్తి అసభ్యంగా ప్రవర్తించాడని మరో మహిళా రెజ్లర్ ఫిర్యాదులో పేర్కొన్నారనీ, ఈ రెండు ఘటనలు బ్రిజ్ భూషణ్ తాను చేస్తున్న చర్యలపై పూర్తి అవగాహనతో ఉన్నాడనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ఢిల్లీ పోలీసులు కోర్టుకు తెలిపారు. కొద్ది నెలల క్రితం బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని ఒక మైనర్ సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తదనంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మైనర్ తన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు. మరోవైపు బ్రిజ్ భూషణ్‌పై మిగిలిన మహిళ రెజ్లర్లు చేసిన ఆరోపణలపై విచారణ చేపట్టిన ఢిల్లీ పోలీసులు కీలక ఆధారాలను సేకరించినట్లు కోర్టుకు తెలిపారు. మహిళా రెజ్లర్ ఫిర్యాదును ప్రస్తావిస్తూ.. తజికిస్తాన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో నిందితుడు ఫిర్యాదదారు(మహిళా రెజ్లర్)ని గదిలోకి పిలిచి బలవంతంగా కౌగిలించుకున్నారని అన్నారు. నిరసన వ్యక్తం చేయగా.. తండ్రిలా చేశాడని చెప్పారు.

ఢిల్లీ పోలీసుల తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ వాదనలు వినిపించారు. దేశం వెలుపల జరిగిన కేసులకు సీఆర్‌పీసీ సెక్షన్ 188 ప్రకారం అనుమతి అవసరమన్న బ్రిజ్‌భూషణ్ తరపు న్యాయవాది వాదనను అతుల్ ఖండించారు. నేరాలన్నీ దేశం బయట జరిగితే మాత్రమే సీఆర్‌పీసీ సెక్షన్ 188 ప్రకారం అనుమతి అవసరమని అతుల్ పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్ విషయంలో ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ నేరాలు జరిగాయని, దీంతో అనుమతి అవసరం లేదని చెప్పారు. ఆయనపై అభియోగాలు మోపేందుకు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్‌పీసీ) కింద రాతపూర్వక ఫిర్యాదు, సెక్షన్ 161 (సాక్షుల విచారణ), 164 (మేజిస్ట్రేట్ ముందు నమోదు చేసిన వాంగ్మూలాలు).. ఈ మూడు రకాల సాక్ష్యాలు సరిపోతాయని పేర్కొన్నారు. గుజరాత్‌లోని సొహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసును ప్రస్తావిస్తూ.. ఆ కేసులో విడివిడిగా అనేక ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని, అయితే కోర్టు వాటన్నింటినీ ఒకే చోట విచారించిందని గుర్తుచేశారు. మొదట్లో బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించాడని అనేక మంది మహిళ రెజర్లు ఆరోపించినా ఢిల్లీ పోలీసులు పట్టించుకోలేదు. సుప్రీం కోర్టు ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించగా దిగి వచ్చిన ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టడం గమనార్హం.

రెండో వన్డేలో టీమిండియా ఘన విజయం

2–0తో సిరీస్ కైవసం

ఇండోర్: మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో ఇండోర్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో భారత జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆసీస్... బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్‌కు దిగిన భారత బ్యాటర్లు అదరగొట్టారు. నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు నష్టపోయి 399 పరుగులు చేశారు. తద్వారా ఆస్ట్రేలియా ముందు 400 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచారు. దాదాపు భారత బ్యాట్స్ మెన్ అంతా రాణించారు. శుభ్ మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ సెంచరీలతో చెలరేగిపోయారు. గిల్ 97 బంతుల్లో 104 పరుగులు చేయగా, శ్రేయస్ 90 బంతుల్లో 105 పరుగులు చేశాడు. కెప్టెన్ కెఎల్ రాహుల్ 38 బంతుల్లో 52 పరుగులు, సూర్యకుమార్ యాదవ్ 37 బంతుల్లో 72 పరుగులతో, ఇషాన్ కిషన్ 18 బంతుల్లో 31 పరుగులు రెచ్చిపోయి ఆడారు. రెండో వికెట్‌కు గిల్, శ్రేయస్ 200 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. సూర్యకుమార్ 44 ఓవర్లో వరుసగా నాలుగు బంతుల్లో నాలుగు సిక్సులు కొట్టాడు. ఆసీస్ బౌలర్లలో కామెరూన్ గ్రీన్ 2, ఆడమ్ జంపా, సీన్ అబాట్, హేజిల్‌వుడ్ ఒక్కో వికెట్ చొప్పున పడగొట్టారు. ఇక భారీ విజయలక్ష్యంతో మైదానంలోకి అడుగు పెట్టిన ఆసీస్‌కు ఆదిలోనే కష్టాలు ఎదురయ్యాయి. తన మొదటి ఓవర్‌లోనే ప్రసిద్ధ్ కృష్ణ దెబ్బ కొట్టాడు. వరుస బంతుల్లో మాథ్యూ షార్ట్ (9), స్టీవ్ స్మిత్(0)ను పెవిలియెన్‌కు పంపాడు. దీంతో ఆసీస్ 9 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. స్కోరు 56 పరుగుల వద్ద ఉండగా... వర్షం కురవడంతో ఆటను నిలిపేసి, మైదానంపై కవర్లు కప్పారు. కాసేపటికి వర్షం నిలిచిపోవడంతో కవర్లు తొలగించి, ఆటను ప్రారంభించారు. అయితే డక్ వర్త లూయిస్ పద్ధతి ప్రకారం ఆసిస్ లక్ష్యాన్ని 33 ఓవర్లలో 317 పరుగులుగా ఖరారు చేశారు. అప్పటికే 9 ఓవర్లు ముగిసి 56 పరుగులు వచ్చిన నేపథ్యంలో మరో 24 ఓవర్లలో 261 పరుగులు చేయాల్సి వచ్చింది. అయితే వాన తగ్గాక మళ్లీ ఇన్నింగ్స్ ఆరంభించిన ఆస్ట్రేలియా వడివడిగా మూడు వికెట్లు కోల్పోయింది. స్పిన్నర్ అశ్విన్ తన స్పిన్ మాయతో మార్నస్ లబూషేన్(27)ను బౌల్డ్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్లో డేంజరస్ డేంజరస్ డేవిడ్ వార్నర్(53), జోష్ ఇంగ్లిస్(6)నును ఎల్బీగా వెనక్కి పంపాడు.. దాంతో, ఆసీస్ 101 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఆ తరువాత ఎవరూ క్రీజులో నిలవకపోవడంతో 217 పరుగులకు ఆలౌట్ అయ్యి ఓటమి పాలైంది.

భారత్ పతకాల వేట షురూ

రోయింగ్, షూటింగ్‌లో నాలుగు పతకాలు

హాంగ్‌జౌ: ఆసియా క్రీడలు ప్రారంభించిన రోజే భారత్ పతకాల వేటతో అదరగొట్టింది. ఇప్పటివరకు మొత్తం 4 పతకాలు సాధించగా... క్రికెట్‌లో మరో పతకం ఖాయం చేసుకుని దూసుకుపోతోంది. రోయింగ్, రైఫిల్ ఈవెంట్లలో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. షూటింగ్‌లో మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్ అంశంలో మెహులిఘోష్, రమిత జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. పురుషుల లైట్‌వెయిట్ డబుల్ స్కల్స్ ఫైనల్లో రోవర్లు అర్జున్ లాల్, అరవింద్ కూడా రజత పతకాన్ని దక్కించుకున్నారు. ఇక పురుషుల కాక్స్‌లెస్ పెయిర్ ఈవెంట్లో భారత రోయింగ్ జోడీ బాబూలాల్‌యాదవ్, లేఖ్ రామ్ కాంస్య పతకం గెలుచుకున్నారు. పురుషుల కాక్స్ ఎయిట్ ఈవెంట్లో భారత రోవర్స్ 05:43.01 టైమింగ్‌తో రెండవ స్థానంలో నిలిచారు. మరోవైపు వ్యక్తిగత 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఈవెంట్లో భారత షూటర్ రమితా జిందాల్ కాంస్య పతకాన్ని అందుకున్నారు.

మహిళల క్రికెట్... ఫైనల్స్‌లో టీమిండియా

ఆసియా క్రీడల్లో భాగంగా జరుగుతున్న మహిళల క్రికెట్ టీ20 టోర్నీలో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌ను ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ కి దిగిన బంగ్లా 51 పరుగులకే ఆల్ అవుట్ కాగా... ఇది పెద్ద లక్ష్యం కాకపోయినా భారత ఓపెనర్లు ఆచితూచి బ్యాటింగ్ చేశారు. కెప్టెన్ స్మృతి మందాన, షెఫాలి వర్మ తడబడినప్ప టికీ... ఆ తరువాత వచ్చిన జెమీమా రోడ్రిగ్స్, కనికా మిగతా లక్ష్యాన్ని అజేయంగా నిలిచి సాధించారు. సెమీస్‌లో విజయం సాధించడంతో భారతజట్టు ఫైనల్ లోకి ప్రవేశించింది. కాగా శ్రీలంక-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన మరో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 75 పరుగులు చేయగా... శ్రీలంక 16.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. సోమవారం జరిగే ఫైనల్ పోరులో భారత్-శ్రీలంక జట్లు స్వర్ణ పతకం కోసం పోటీ పడనున్నాయి.

కాగా మహిళల టేబుల్ టెన్నిస్ టీమ్ రౌండ్ ఆఫ్ 16లో భారత్ 2–3 తేడాతో థాయ్‌లాండ్‌పై ఓడిపోయింది. పురుషుల హాకీ పూల్ ఏ మ్యాచ్‌లో భారత్ 16–0తో ఉజ్బెకిస్థాన్‌పై విజయం సాధించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.